


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 16 నవంబరు 2021 సంపుటి : 03 సంచిక : 88 పేజీలు : 4 వెల : రూ



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787


# నెల్లూరు కార్పొరేషన్, 12 మున్సిపాలిటీల్లో ముగిసిన పోలింగ్



నెల్లూరు కార్పొరేషన్, 12 మున్సిపాలిటీల్లో పోలింగ్ ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరిగింది. 5 గంటల వరుకూ క్యూలో ఉన్నవారికి ఓటువేసేందుకు అవకాశం ఇచ్చారు. ఈ నెల 17న కౌంటింగ్ నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల వరకు నెల్లూరు కార్పొరేషన్‌లో 50.1 శాతం, బుచ్చిరెడ్డిపాలెంలో 61.6 శాతం, దాచేపల్లిలో 71.88 శాతం, గురజాలలో 71.8 శాతం పోలింగ్ నమోదైంది.ప్రకాశం జిల్లా దర్శి 13వ వార్డులో టీడీపీ నేతల ఓవరాక్షన్ చేశారు. ఓట్లు వేయడానికి వచ్చిన స్థానికులపై టీడీపీ కార్యకర్తలు చేయి చేసుకున్నారు. ఓడిపోతామనే భయంతో అలజడి సృష్టించారు.వైఎస్సార్ జిల్లా: రాజంపేట 15వ వార్డు వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. దొంగ ఓట్లు వేస్తున్న వ్యక్తిని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పట్టుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద అల్లరి మూకలపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. పోలీసులపై రౌడీమూకలు రాళ్ల దాడి చేశారు.సాయంత్రం 4 గంటల వరకు నెల్లూరు కార్పొరేషన్‌లో 42.71 శాతం, బుచ్చిరెడ్డిపాలెంలో 58.66 శాతం, ఆకివీడులో 72.03 శాతం, కమలాపు రంలో 74.81 శాతం, రాజంపేటలో 64.83 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 3 గంటల వరకు నెల్లూరు కార్పొరేషన్‌లో 38.9 శాతం, బుచ్చిరెడ్డి పాలెంలో 55.48 శాతం, బేతంచర్లలో 67.99 శాతం, దాచేపల్లిలో 67.97. శాతం, కమలాపురంలో 71.84 శాతం, రాజంపేటలో 60.47 శాతం, పెనుకొం డలో 75.99 శాతం పోలింగ్ నమోదైం ది.మధ్యాహ్నం ఒంటి గంట వరకు నెల్లూరు కార్పొరేషన్‌లో 30.13 శాతం పోలింగ్ నమోదైంది. బుచ్చిపాలెంలో 50.9 శాతం, కుప్పంలో 68 శాతం, రాజంపేటలో 50.35 శాతం, గురజాల లో 53.72, జగ్గయ్యపేటలో 57 శాతం, పెనుకొండలో 55.91 శాతం పోలింగ్ నమోదైంది.పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో భారీ వర్షం కురుస్తోంది. వర్షం లోనూ ఓటు హక్కు వినియోగించు కోవడానికి ఓటర్లు తరలి వస్తున్నారు. ఆకివీడులో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ కార్తికేయ మిశ్రా పరిశీలించారు. ఓటర్లు కూడా ఉత్సాహంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని కలెక్టర్ అన్నారు. అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ పరిశీలిస్తున్నామని తెలిపారు.మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆకివీడులో 55.18 శాతం, బేతంచర్లలో 61.91 శాతం, దాచేపల్లిలో 59.01 శాతం, దర్శిలో 57 శాతం, కమలాపురంలో 64.57 శాతం, రాజంపేటలో 50.35 శాతం పోలింగ్ నమోదైంది.?అనంతపురం జిల్లా పెనుకొండ నగరపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 11 గంటల వరకు 36.5 శాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఓట్లు వేసేందుకు పెద్దసంఖ్యలో మహిళలు తరలి వస్తున్నారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్‌లో 20 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 11 గంటల వరకు నెల్లూరు కార్పొరేషన్‌లో 15.9 శాతం, బుచ్చిరెడ్డిపాలెంలో 37.31 శాతం, కుప్పంలో 37.75 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 11 గంటల వరకు బేతంచర్లలో 43.56 శాతం, ఆకివీడులో 37.52 శాతం పోలింగ్ నమోదైంది.ఉదయం 11 గంటల వరకు దర్శిలో 35.16 శాతం, జగ్గయ్యపేటలో 27 శాతం, కమలాపురంలో 42.45 శాతం, రాజంపేటలో 34.38 శాతం, దాచేపల్లిలో 39.39 శాతం, గురజాలలో 35.55 శాతం పోలింగ్ నమోదైంది. మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ తాన ఓటు హక్కు వినియోగించుకున్నారు. నెల్లూరు కార్పొరేషన్ సహా 12 మున్సిపాలిటీలకు ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఆకివీడు నగర పంచాయతీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఉదయం 11 గంటల వరకు 37.68 శాతం పోలింగ్ నమోదైంది. ఆకివీడు నగర పంచాయితీ పోలింగ్ ప్రక్రియని జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మస్వయంగా పర్యవేక్షించారు. పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ.. ఆకివీడు నగర పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఉదయం 11 గంటల వరకు దాదాపు 40 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్సై స్థాయి అధికారులని బందోబస్తుకి వినియోగించామని పేర్కొన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాపర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ సహా 12 మున్సిపాలిటీలకు ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. నెల్లూరు 16వ డివిజన్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతపుం: పెనుకొండ జీఐసీ కాలనీలో మంత్రి శంకర్ నారాయణ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. దర్శి నగర పంచాయతీలో 19 వార్డులకు పోలింగ్ కొనసాగుతోంది. గురుజాల నగర పంచాయతీలో 14 వార్డులకు పోలింగ్ జరుగుతోంది. దాచేపల్లి నగర పంచాయతీలో 19 వార్డులకు పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. బేతంచర్ల నగర పంచాయతీలో 20 వార్డులకు ప్రశాంతంగా కొనసాగుతున్న పోలింగ్. ఉదయం 9 గంటల వరకు 18.73 శాతం పోలింగ్ నమోదైంది.ఆకివీడు నగర పంచాయతీ ఎన్నికలు పోలింగ్ కొనసాగుతుంది. ఉదయం 9 గంటల వరకు 13.68 శాతం పోలింగ్ నమోదైంది.నెల్లూరు కార్పొరేషన్ సహా 12 మున్సిపాలిటీలకు ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. వైఎస్సార్ జిల్లాలోని కమలాపురం మున్సిపాలిటీలో ఎన్నికల పోలింగ్‌లో 6 వార్డులో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నెల్లూరు కార్పొరేషన్ సహా 12 మున్సిపాలిటీలకు ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఓటు వేయడానికి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివస్తున్నారు. బుచ్చిరెడ్డి పాలెం నగర పంచాయతీలో 20 వార్డులకు పోలింగ్ కోనసాగుతోంది.కుప్పం మున్సిపాలిటీలో 24 వార్డులకు పోలింగ్ కొనసాగుతోంది.జగ్గయ్యపేట మున్సిపాలిటీలో 31 వార్డులకు పోలింగ్ కొనసాగుతోంది. పెనుకొండ నగర పంచాయతీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. పెనుకొండలో 20 వార్డులకు పోలింగ్ జరుగుతోంది. రాజంపేటలో 29 వార్డులకు పోలింగ్ కొనసాగుతోంది.? కమలాపురం నగర పంచాయతీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది.

# గిరిజనుల దుస్థితికి కాంగ్రెస్సే కారణం: మోదీ



భోపాల్: గిరిజనుల సంక్షేమాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేస్తూ వచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గత పాలకుల హయాంలో వెనుకబడిన ప్రాంతాలుగా మిగిలిపోయిన వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన బిర్సా ముండా జయంతి అయిన నవంబర్ 15వ తేదీని ఇకనుంచి 'జన్‌జాతీయ గౌరవ్ దివస్'గా కేంద్రం నిర్వహిస్తున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. అంబేద్కర్ జయంతి, గాంధీ జయంతి తరహాలోనే భగవాన్ బిర్సా ముండా జయంతిని ఏటా నవంబర్ 15న నిర్వహిస్తామని అన్నారు. స్వాంతంత్ర్యం వచ్చిన తర్వాత జరుపుతున్న తొలి 'జన్‌జాతీయ గౌరవ్ దివస్' ఇదని పేర్కొన్నారు. భోపాల్‌లో సోమవారం నిర్వహించిన 'జన్‌జాతీయ గౌరవ్ దివస్' మహాసమ్మేళనంలో ప్రధాని పాల్గొన్నారు.''గిరిజనులను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. కనీన సౌకర్యాలకు కూడా వారు నోచుకోలేదు. గత ప్రభుత్వ (కాంగ్రెస్) హయాలంలో వెనుకబడిన ప్రాంతాలకు గానే మిగిలిపోయిన 100 జిల్లాల్లో ఇప్పుడు అభివృద్ధి పట్టాలెక్కుతోంది''అని ప్రధాని ఈ సందర్భంగా అన్నారు. స్వాంతంత్ర్య వచ్చిన తర్వాత జరుపుతున్న తొలి జన్‌జాతీయ గౌరవ దివస్ ఇదని చెప్పారు. స్వాతంత్ర్య పోరాటం, జాతి నిర్మాణంలో గిరజన కళలు, సంస్కృతి, వారి సేవలు ప్రశంసనీయమని. గోండుల రాణి దుర్గవతి సాహసం కానీ, రాణి కమలాపతి త్యాగం కానీ దేశం ఎప్పటికీ మరిచిపోదని అన్నారు. సాహసవంతులైన భిల్ల జాతి గిరిజనులు లేకుండా వీర మహారాణా ప్రతాప్ పోరాటం ఊహించడం కూడా సాధ్యం కాదని అన్నారు. గత ప్రభుత్వాలు గిరిజన ప్రముఖులను, వారి సేవలను నిర్లక్ష్యం చేసిందని, గిరిజన సమాజం సేవలను దేశానికి చెప్పలేదని, పరిమిత సమాచారం మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. జన్‌జాతీయ గౌరవ్ దివస్ మహాసమ్మేళనంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పాల్గొన్నారు. పెద్దఎత్తున ప్రజానీకం హాజరయ్యారు.

## రాణి కమలాపతి రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన మోదీ

భోపాల్: గోండు పాలకురాలు రాణి కమలాపతి రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ భోపాల్‌లో సోమవారం ప్రారంభించారు. మధ్యప్రదేశ్‌లో తొలి వరల్డ్ క్లాస్ రైల్వే స్టేషన్‌గా దీనిని ఇటీవల అభివృద్ధి పరిచారు. రాణి కమలాపతి రైల్వే స్టేషన్‌తో పాటు పలు రైల్వే ప్రాజెక్టులను దేశప్రజల కు ప్రధాని అంకింతం చేశారు. భోపాల్‌లో నిర్వహిం చిన తొలి 'జన్‌జాతీయ గౌరవ్ దివస్' మహాసమ్మేళన్‌లో పాల్గొనేందుకు ప్రధాని ఇక్కడకు వచ్చారు.గేజ్ కన్వర్షన్‌తో పాటు విద్యుద్దీకరణ చేసిన ఉజ్జయిని-ఫతేబాద్ ఛంద్రావిగంజ్ బ్రాడ్ గ్రేజ్ సెక్షన్, ఎలక్ట్రిఫైడ్ మథేలా-నిమర్ ఖేరి బ్రాడ్ గేజ్ సెక్షన్, ఎలక్ట్రిఫైడ్ గుణ-గ్వాలియర్ సెక్షన్‌లను కూడా మోదీ ఈ సందర్భంగా జాతికి అంకితం చేశారు. వీటితో పాటు ఉజ్జయిని-ఇండోర్, ఇండోర్-ఉజ్జయిని మధ్య నడిచే రెండు కొత్త ఎంఈఎంయూ రైళ్లను జెండా ఊపి ప్రారంభించారు.




# టీడీపీ ఇప్పటికే కాడి పడేసింది: సజ్జల



రాష్ట్రంలో 12 మున్సిపాల్టీలు, ఒక కార్పొరేషన్‌లో ఎన్నికలు జరుగుతున్నాయని.. ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న అభిప్రాయం ఇప్పటికే తెలిసిపోయిందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ, తెలుగుదేశం ఇప్పటికే కాడి పడేసిందన్నారు.చంద్రబాబు చెరలో దశాబ్దాలుగా కుప్పం మగ్గిపోయింది. సీఎం జగన్ వచ్చాకే సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయి. ఏ ఎన్నికలు వచ్చినా సీఎం జగన్ పాలనకు ప్రజలు పట్టంగడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ దిగజారుడు రాజకీయాలు చేయలేదు. మా ప్రభుత్వం పనితీరును ప్రజలు మెచ్చుకుంటున్నారని'' సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.ఓటర్లకు డబ్బులు పంచుతూ టీడీపీ నేతలు అడ్డంగా దొరికారు. రౌడీషీటర్లను టీడీపీ నేతలు.. పార్టీ ఏజెంట్లుగా పెట్టారు. లేనిది ఉన్నట్టు.. ఉన్నది లేనట్టు చంద్రబాబు ప్రచారం చేస్తున్నారు. చంద్రబాబు అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. కుప్పంలో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్న నమ్మకం ఉంది. మంచి చేసే నేతలను ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారు. వరుస ఎన్నికల్లో ప్రజలు ఇస్తున్న తీర్పే అందుకు నిదర్శనమని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

# ఇలాంటి పనులు చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు: చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైందని, ప్రజలు తిరగబడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో వైసీపీ అక్రమాలపై సోమవారం ఆయన మంగళగిరి పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు ఇన్ని కుట్రలా?.. ఇలాంటి పనులు చేస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని అన్నారు. దొంగ ఓటర్లను పట్టించినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో అసలు పోలీస్ వ్యవస్థ ఉందా? అనే అనుమానం కలుగుతోందన్నారు. ఎన్నికల్లో వైసీపీ నేతలు దారుణంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.గెలిచామని చెప్పుకోవడానికి అక్రమాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు విమర్శించారు. దొంగ ఓటర్లను పట్టుకున్నవారిపై పోలీసులు లాఠీచార్జ్ చేస్తారా? అంటూ దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అక్రమాలు, అరాచకాలే కనిపిస్తున్నాయన్నారు. అధికార పార్టీకి అడ్డూ.. అదుపు లేకుండా పోయిందన్నారు. ఏం చేసినా చెల్లుతుందనే ధీమాలో వైసీపీ ఉందని, హద్దులు మీరితే పరిస్థితులు చేయి దాటిపోతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. త్వరలో వైసీపీకి ప్రజలే సరైన సమాధానం చెబుతారన్నారు. ఈ దుర్మార్గపు రాజకీయాలను అడ్డుకుని తీరుతామన్నారు. ఏపీ నుంచి కూరగాయల పేరుతో బాంబేకి గంజాయి తరలిస్తున్నారని, గంజాయిని పోలీసులు ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ప్రశ్నించారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు. వైసీపీని ప్రజల ముందు దోషిగా నిలబెట్టే వరకు పోరాడుతామన్నారు. అసలు రాష్ట్రంలో ఎస్ఈసీ ఉందా? అని ప్రశ్నించారు. వైసీపీ అక్రమాలపై ఆధారాలిచ్చినా స్పందించడం లేదని, ఫిర్యాదులను పట్టించుకోకుండా టీడీపీ నేతలను అరెస్ట్ చేస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వివేకా హత్యకు భూ వివాదానికి సంబంధం లేదు: ఎంపీ రఘురామ


ఢిల్లీ: వైఎస్ వివేకా హత్యకు భూ వివాదానికి సంబంధం లేదని ఎంపీ రఘురామ కృష్ణరాజు చెప్పారు. భూ వివాదం కారణంగా వివేకా హత్యకు గురయ్యారని ప్రజలను తప్పుదోవపట్టించడానికే దస్తగిరి వాంగ్మూలం ఇచ్చినట్లు అర్థమవుతుందన్నారు. నిజాలు బయట పెట్టేందుకు సీబీఐ మరింత లోతుగా దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రూ.8 కోట్ల భూవివాదంలో 40 కోట్ల సుపారీ గంగిరెడ్డి ఎలా ఇస్తానన్నారో తెలియాల్సి ఉందన్నారు. దీని వెనక కచ్చితంగా పెద్దల హస్తం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు



# హైకోర్టు రిటైర్డ్ జడ్జితో 'లఖింపూర్' ఘటనపై దర్యాప్తు..

### అంగీకరించిన యూపీ సర్కారు

న్యూఢిల్లీ : లఖింపూర్ ఖేరీ హింసాత్మక ఘటనపై సోమవారం సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఘటనపై దర్యాప్తును హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని జరిపేందుకు యూపీ సర్కారు గీకరించింది. దీంతో ఈ కేసు దర్యాప్తుపై ఆదేశాలను బుధవారం జారీ చేస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. సిట్ బృందంలో సీనియర్ ఐపీఎస్ అధికారులకు చోటు కల్పించాలని, వారి పేర్లను మంగళవారంలోగా యూపీ ప్రభుత్వం సిఫారసు చేయాలని ఆదేశిస్తూ కేసు విచారణను బుధవారానికి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా యూపీ ప్రభుత్వం తరఫున హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు.ధర్మాసనం ఏ హైకోర్టుకు (అలహాబాద్ హైకోర్టుతో సహా) చెందిన రిటైర్డ్ జడ్జినైనా కేసు విచారణ కోసం నియమించవచ్చని తెలిపారు. ఇంతకు ముందు సుప్రీం కోర్టు.. హైకోర్టు మాజీ న్యాయమూర్తిని నియమించాలని గతంలో ప్రభుత్వాన్ని



ఆదేశించింది. రిటైర్డ్ న్యాయమూర్తులు రాకేశ్‌కుమార్ జైన్, రంజిత్ సింగ్ పేర్లను సిఫారసు చేసింది.

# సంపాదకీయం

మంగళవారం 16 నవంబరు 2021

## స్వరాజ్, స్వదేశీ,స్వభాష

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 'రాజ్‌భాష' (జాతీయ భాష)పై ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. శనివారం వారణాసిలో జరిగిన 'అఖిల భారత అధికార భాషా సదస్సు'లో అమిత్ షా ప్రసంగిస్తూ.. తనకు గుజరాతీ కంటే హిందీ భాష అంటే ఎక్కువ అభిమానం అని అన్నారు. హిందీ భాష అంటే చాలా ఇష్టం. మన రాజభాషను బలోపేతం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చారు. దానికి మూడు స్తంభాలుగా ఉన్నా- స్వరాజ్, స్వదేశీ, స్వభాష అని గుర్తు చేసిన అమిత్ షా.. స్వరాజ్యం సాధించుకున్నాం.. కానీ స్వదేశీ, స్వభాష వెనుకబడి ఉన్నాయన్నారు. హిందీ మన స్థానిక భాషలన్నింటికీ ఎటువంటి వైరుధ్యం లేదన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో రాజభాషపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వారణాసిలో జరిగిన 'అఖిల్ భారతీయ రాజభాషా సమ్మేళనం'లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కూడా పాల్గొన్నారు. అమిత్ షా తన ప్రసంగానికి ముందు వారణాసిలోని దీనదయాళ్ హస్తకళా సంకుల్‌లో అఖిల భారతీయ రాజభాషా సమ్మేళనంలో హిందీ పత్రికను విడుదల చేశారు. వీర్ సావర్కర్ లేకుంటే ఇప్పటికీ మనం ఇంగ్లీషు చదువుతూ ఉండేవాళ్లమని అమిత్ షా అన్నారు. హిందీ నిఘంటువును రూపొందించింది సావర్కర్ అని ఆయన గుర్తు చేశారు. ఇంగ్లీషు మాపై మోపబడింది. హిందీ డిక్షనరీ కోసం కృషి చేయాల్సి ఉంటుందని, దాన్ని బలోపేతం చేయాలన్నారు. 2019లోనే రాజధాని ఢిల్లీ నుంచి అఖిల భారత అధికార భాషా సదస్సును నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామని అమిత్ షా చెప్పారు. కరోనా మహమ్మారి కారణంగా రెండేళ్లుగా చేయలేకపోయాం. కానీ ఈరోజు స్వాతంత్ర్య అమృతోత్సవంలో ఈ కొత్త శుభారంభం జరగబోతోందని సంతోషిస్తున్నాను. స్వాతంత్ర్య అమృత్ మహోత్సవ్‌లో, దేశ ప్రజలందరికీ పిలుపునిస్తున్నాను. స్వయం భాష కోసం మన లక్ష్యాలలో ఒకటి, మనం తప్పుకున్న దానిని మనం గుర్తుంచుకోవాలి. దానిని మన జీవితంలో భాగం చేసుకోవాలి. హిందీ, మన స్థానిక భాషలన్నింటికీ వైరుధ్యం లేదని అమిత్ షా స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన వారి స్మృతి చిహ్నాలను పునరుజ్జీవింపజేసి యువ తరానికి స్ఫూర్తినివ్వడమే అమృత్ మహోత్సవ్ అని ప్రధాని మోడీ చెప్పారని, ఇది మనకు సంకల్ప సంవత్సరం అని అమిత్ షా అన్నారు. గాంధీజీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చారు, దానికి మూడు స్తంభాలు ఉన్నాయి ? స్వరాజ్, స్వదేశీ మరియు స్వభాష. స్వరాజ్యం సాధించబడింది, కానీ స్వదేశీ, స్వభాష వెనుకబడిపోయింది. 2014 తర్వాత తొలిసారిగా మేక్ ఇన్ ఇండియా గురించి మాట్లాడి ఇప్పుడు స్వదేశీ గురించి మళ్లీ స్వదేశీనే లక్ష్యంగా చేసుకున్న మోడీ.. భాష ఏదైనప్పటికీ వ్యాకరణాన్ని ప్రక్షాళన చేయడంలో కాశీకి పెద్దపీట వేశారు. స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతున్నప్పుడు దేశంలో అధికార భాష, స్థానిక భాషల ఆధిపత్యం చాలా బలంగా ఉండాలని హిందీ ప్రేమికులందరికీ ఇది సంకల్ప సంవత్సరం కావాలని హోంమంత్రి షా అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం వారణాసిలో భారతీయ జనతా పార్టీ విధానసభ ఇన్‌ఛార్జ్‌తో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారణాసిలోని కాల భైరవ ఆలయంలో ప్రార్థనలు చేశారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉత్తరప్రదేశ్ ఎన్నికల ఇన్‌ఛార్జ్, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా షా వెంట ఉన్నారు. ఉత్తరప్రదేశ్ శాసనసభకు 403 మంది సభ్యులను ఎన్నుకోవడానికి వచ్చే ఏడాది ప్రారంభంలో ఎన్నికలు జరగనున్నాయి.

# టచ్ మీ నాట్ గా సలహాదారులు

విజయవాడ, నవంబర్ 15, (న్యూస్ పల్స్)ఓ కీలకమైన విషయానికి సంబంధించి ప్రభుత్వం ఆ పెద్దాయన్ని సలహాదారుగా నియమించుకుంది. సలహాలతో ప్రభుత్వానికి సరైన గైడెన్స్ ఇవ్వడమో.. లేక సమన్వయమో చేయాలి. ఆ సలహాదారు మాత్రం టచ్ మీ నాట్‌గా ఉండిపోయారు. తాను చెప్పినా ఎవరూ వినరని నిస్తేజమా? నాకెందుకులే అనే భావనా? ఏదీ అర్థం కాకుండా ఉందట. మరి ఆయనకు పదవి ఇచ్చి ఏ లాభం అనే చర్చ అప్పుడే మొదలైపోయిందట. ఇంతకీ ఎవరాయన?చంద్రశేఖర్ రెడ్డి. ఒఖఔఉ రా అధ్యక్షుడిగా పనిచేశారు. పదవీ విరమణ చేయగానే ప్రభుత్వం కూడా ఆయన్ను గుర్తించి.. ఉద్యోగులకు సంబంధించిన అంశంపై సలహాదారుగా నియమించింది. చంద్రశేఖర్‌రెడ్డిని అలా సలహాదారుగా నియమించారో లేదో.. పీఆర్సీ అమలు కోసం ప్రభుత్వంపై ఉద్యోగుల నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. ఈ సమయంలో సలహాదారు హోదాలో చంద్రశేఖర్ రెడ్డి పాత్ర కీలకం. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలి. కానీ ఇటీవల జరుగుతున్న పరిణామాల్లో ఎక్కడా చంద్రశేఖర్ రెడ్డి ఆ తరహా పాత్ర పోషించిన.. పోషిస్తోన్న దాఖలాలు కన్పించడం లేదనే చర్చ ఉద్యోగ వర్గాల్లో జోరుగా సాగుతోంది. రాజధానిలో సీరియస్‌గా చర్చలు జరుగుతుంటే రెడ్డిగారు కడప జిల్లాలో సన్మానాలు చేయించుకుంటున్నారట.పీఆర్సీ నివేదిక కోసం ఉద్యోగ సంఘాల ప్రతినిధులు దాదాపు 5 గంటలపాటు సచివాలయంలో బైఠాయించి చిన్నసైజు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం వైపు నుంచి ఎవ్వరూ స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు ఉద్యోగులు. చివరకు నెలాఖరులోగా ఖఖీఅ సమస్యను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాలు అల్టిమేటం ఇచ్చాయి. ఈ మధ్యకాలంలో ఇలాంటివి ఎప్పుడూ జరగలేదు. ఇది ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపే అంశం. గతంలో అంటే ప్రభుత్వం.. దాని తరఫున అధికారులు సంఘాలతో చర్చించి సర్దుబాటు చేసుకునేవారు. కానీ.. ఇప్పుడు ప్రత్యేకించి.. పైగా ఏరికోరి ఓ సలహాదారుడిని నియమించుకుంటే ఫలితం లేకుండా పోయిందనే భావన వ్యక్తమవుతోంది. వాస్తవంగా రోజువారీ వ్యవహారాల్లో ఉద్యోగుల విషయాల్లో ఇవ్వడానికి సలహాలు ఏమీ ఉండవట. ఖఖీఅ వంటి కీలక విషయాల్లోనే చేస్తే ఏదైనా చేయవచ్చు. అలాంటిది ఇప్పుడే గాయబ్ అయితే ఇక ఆయన ఎందుకు? ఆయనకు ఆ పదవి ఎందుకు అనే విమర్శ వినిపిస్తోంది.సచివాలయంలో బైఠాయింపు జరిగిన సందర్భంలోనే పరిస్థితి తీవ్రతను చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి ఉంటే ఇంత వరకు వచ్చేది కాదని.. ఈ స్థాయిలో విమర్శలు ఉండేవి కావని ప్రభుత్వంలో జరుగుతున్న చర్చ. చంద్రశేఖర్‌రెడ్డిని ఉద్యోగ వ్యవహారాల సలహాదారుగా నియమించే సందర్భంలోనే ఒఖఔఊ మినహా.. ఇతర ఉద్యోగ సంఘాలు వ్యతిరేకించాయి. ఆయన్ను సలహాదారుగా నియమించ వద్దని సూచించాయి. కానీ ప్రభుత్వం రెడ్డి సినియారిటీని దృష్టిలో పెట్టుకుని ఆయన్ను సలహాదారుగా నియమించుకుంది. దీంతో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కూడా ఏం చేయలేక సైలెంట్ అయ్యారు. ఈ క్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి మరింత బాధ్యతతో వ్యవహరిస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సలహాదారుగా తన నియామకాన్ని వ్యతిరేకించిన వారిని కూడా కలుపుకొని వెళ్లి.. వారికి నచ్చచెప్పి.. ప్రభుత్వానికి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత చంద్రశేఖర్ రెడ్డి మీద ఉంది కదా అన్నది వారి వాదన.

# ఆదాయం పెరిగిన కష్టాలు తప్పేలా లేవు

విజయవాడ, నవంబర్ 15, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థఇతి అత్యంత దారుణంగా ఉందని తొలి ఆరు నెలల రిపోర్ట్‌తో కాగ్ బయట పెట్టింది. రెవిన్యూ లోటు తొలి ఆరు నెలల్లో ఏకంగా రూ.33,140.62 కోట్లుగా నమోదయింది. అంటే 662 శాతం అధికం. ఆదాయానికి, ఖర్చులకు మధ్య పొంతన లేకపోవడమే దీనికి కారణం. ఏపీ ఆర్థిక పరిస్థితి నిజానికి ఎంతో మెరుగ్గా ఉండాలి. ఎందుకంటే ఆదాయం భారీగాపెరిగింది. ఆరు నెలల్లో పన్నులు, కేంద్ర గ్రాంట్లు, అప్పుల ద్వారా ఏపీ ప్రభుత్వ ఖాతాకు వచ్చిన ఆదాయం రూ. లక్షా నాలుగు వేల కోట్లపైనే. ఇందులో అప్పులు రూ. 40వేల కోట్లు. మిగతా రూ. 65వేల కోట్లు పన్నులు, గ్రాంట్లు. గత ఏడాది కన్నా రూ. 20వేల కోట్లు ఎక్కువ. ఇంత భారీగా పన్నుల ఆదాయం పెరగడం అసాధారణం. ప్రభుత్వం మద్యం రేట్లు భారీగా పెంచడం సహా అనేక రకమైన పన్నులను విధించడంతో ఈ ఆదాయం కళ్ల జూస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్లు కూడా అనూహ్యంగా పెరిగాయి. గతంలో రూ. నాలుగు వేల కోట్లకు అటూ ఇటుగా వచ్చి న గ్రాంట్లు ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో రూ. 18,117.56 కోట్లు ప్రభుత్వ ఖాతాలో జమ అయ్యాయి. ఇంత ఆదాయం వచ్చినా ప్రభుత్వం లెక్కలేనన్ని అప్పులు చేస్తోంది. తొలి ఆరు నెలల్లో కొద్దిగా తక్కువగా రూ.40వే కోట్ల అప్పు చేసింది. అయినా లోటు మాత్రం అలాగే ఉండిపోయింది.ప్రభుత్వం ఎవరికీ బిల్లులు చెల్లించడం లేదు. ఉద్యోగులకు ప్రయోజనాలు కల్పించడం లేదు. అభివృద్ధి పనులకు ఖర్చులు చేయడం లేదు. కనీస అవసరాలకు సరఫరా చేస్తున్న వాటికీ బిల్లులు చెల్లించడం లేదు. పిల్లలకు ఇచ్చే పాలు, గుడ్ల బిల్లులు కూడా చెల్లించడం లేదన్న ఆరోపణలు వసతున్నాయి. నిన్నటికి నిన్న మెడికల్ ఉపకరణాలను ఏపీకి సరఫరా చేయవద్దని ఐఎండీ ఇండస్ట్రీ ఆదేశాలు జారీ చేసింది. సివిల్ కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించడం మానేసి చాలా కాలం అయింది. వారు టెండర్లు కూడా వేయడం లేదు. ప్రభుత్వం టెండర్లు పిలిస్తే ఎవరూ పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. చివరికి ప్రభుత్వ శాఖలు కరెంట్ బిల్లులు చెల్లించడం లేదు. డిస్కంలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ నిధులు కూడా ఇవ్వడంలేదు. డిస్కంలకు రెండున్నరేళ్లలో రూ. పాతిక వేల కోట్ల బకాయి పడ్డారని తక్షణం చెల్లించాలని ఏపీఈఆర్సీ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఇలాంటి ఆర్థిక సమస్యలు ప్రభుత్వానికి కోకొల్లలుగా ఉన్నాయి. రూపాయి రాకపోకల గురించి ఎవరు జవాబు దారీ ? జీతాలు, పెన్షన్లు ఏ ప్రభుత్వం అయినా ఇవ్వాలి. ఇస్తాయి. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇస్తుంది. ఇక ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో నేరుగా ప్రజలు భారీగా రూ. పదివేలకుపైగా డబ్బు అందుతున్నది ఒక్క అమ్మఒడి మాత్రమే. యాభై లక్షల మంది వరకూ ఇస్తున్నారు. మిగతావన్నీ చాలా పరిమితమైన లబ్దిదారులు. ఓ పథకం అందితే మరో పథకం అందనివ్వరు. గత ప్రభుత్వంలో ఉన్న పథకాలన్నింటినీ ఆపేశారు. మరి ఆ డబ్బులన్నింటినీ ఏం చేస్తున్నారు..? తెస్తున్న అప్పులు ఏమవుతున్నాయి ? మందు బాబుల్ని నిలువు దోపిడి చేసి పోగేస్తున్నదంతా ఎటు పోతున్నాయి.? ఇవన్నీ లెక్కలు బయటపెడితే కానీ మిస్టరీ వీడదు.

# పదవులు కోసం లాబీయింగ్

అనంతపురం, నవంబర్ 15, (న్యూస్ పల్స్)అక్కడ పదవులు ఊరకనే రావ్.. ! ఎన్నో ఫైటింగ్‌లు చేయాలి.. లాబీయింగ్ నడపాలి?! ఆ జిల్లాలో ఇలాంటి తతంగాలు చాలానే ఉంటాయి. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీల్లోనూ అదే సీన్. ఒక పదవి కోసం ముగ్గురు రేస్‌లోకి వచ్చారు. ఆ ముగ్గురిలో ఇద్దరు స్వయాన అన్నదమ్ములు. ఒకరి వ్యూహం ఇంకొకరికి లీక్ కాకుండా పావులు కదపడమే ఆసక్తి కలిగిస్తోంది. అనంతపురం జిల్లా రాజకీయాలు రాష్ట్రంలోనే భిన్నం. ఒక్కోసారి పదవుల కోసం ఎలాంటి పోటీ ఉండదు. మరోసారి పోటీ ఓ రేంజ్‌లో ఉంటుంది. ఎవరిని ఎంపిక చేయాలో తెలియక అధినేతలు సైతం తల పట్టుకునే పరిస్థితి కనిపిస్తుంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కూడా అలాంటి సిచ్యువేషన్‌నే తీసుకొచ్చింది. ఒక్కటే సీటు కావడంతో జిల్లా అంతా వైసీపీ నుంచి పోటీ ఉంటుందని భావించారు. కానీ.. ఉరవకొండ నుంచే ముగ్గురు ఉడుంపట్టు పట్టడంతో ఉత్కంఠ రేపుతోంది. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ముగ్గురూ తీవ్రస్థాయిలో ఎమ్మెల్సీ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారట. విశ్వేశ్వరరెడ్డి, శివరామిరెడ్డిల మధ్య పొరపొచ్చలున్నాయి. 2014 ఎన్నికల్లో అనంతపురం జిల్లాలో వైసీపీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచింది ఇద్దరే. అందులో కదిరి ఎమ్మెల్యే చాంద్ బాషా టీడీపీలోకి జంప్ చేయగా.. విశ్వేశ్వరరెడ్డి వైసీపీలోనే ఉన్నారు. 2019 ఎన్నికల్లో విశ్వకే వైసీపీ టికెట్ ఇచ్చినా.. ఆయన ఓడిపోయారు. దీంతో ఆయనను ఎమ్మెల్సీని చేస్తారని ప్రచారం జరిగింది. అయితే చాలాకాలంగా వైసీపీలో ఉంటున్న మాజీ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి సైతం పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. వీళ్లిద్దరిదీ ఒక పంచాయితీ అయితే.. విశ్వేశ్వరరెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి సైతం టికెట్ ఆశిస్తుండటం ఆసక్తిగా మారింది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ మెజారిటీ స్థానాలను దక్కించుకుంది. గతంలో ఇదే కోటా ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థులు కోట్లు ఖర్చు పెట్టారు.

కానీ.. ఈసారి అలాంటి పరిస్థితి ఉండదన్నది వైసీపీ నేతల మాట. వైసీపీ పెద్దల ఆశీసులతో టికెట్ సంపాదిస్తే ఎమ్మెల్సీ కావడం ఖాయం. అందుకు ముగ్గురు నేతలు పోటాపోటీగా లాబీయింగ్ చేస్తున్నారట. శివరామిరెడ్డికి సంబంధించి ఆయన సోదరులు మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు ఎమ్మెల్యేలుగా వైసీపీ నుంచి గెలిచారు. ఒకే కుటుంబంలో ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఆ ఈక్వేషన్లు శివరామిరెడ్డి ఆశలకు గండి కొడతాయా లేక.. పార్టీ పిలిచి టికెట్ ఇస్తుందా అన్నది తేలాలి. ఈ ముగ్గురే కాకుండా జిల్లాలో మరికొందరు వైసీపీ నేతలు సైతం ఎమ్మెల్సీ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. రేస్‌లో మాత్రం విశ్వేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివరామిరెడ్డి గురించే చర్చ జరుగుతోంది. వైసీపీ అధిష్ఠానం ఇప్పటికే వడపోతలు పూర్తి చేసిందని సమాచారం. పదవీయోగం కలిగిన ఆ నాయకుడు ఎవరో.. ఎలాంటి సమీకరణాలు తెరపైకి వస్తాయో చూడాలి

# వైసీపీలో అసంతృప్తులు...




నెల్లూరు, నవంబర్ 15, (న్యూస్ పల్స్)ఎమ్మెల్సీ పదవుల కేటాయింపు వైసీపీలో అసంతృప్తి రేగుతుంది. బలహీనమైన నాయకులను ఎంపిక చేశారన్న వాదనలు విన్పిస్తున్నాయి. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారిని కాదని, పైరవీలకే పెద్ద పీట వేస్తున్నారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రకాశం జిల్లాలో తూమాటి మాధవరావు ఎంపికపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. అదే సమయంలో గుంటూరులో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మూరుగుడు హన్మంతరావు ఎంపిక పై కూడా పెదవి విరుపులు వినపడుతున్నాయి. కమ్మ సామాజికవర్గంలో బలమైన నేతలు మర్రి రాజశేఖర్, రావి వెంకట రమణ కు పదవులు ఇవ్వకపోవడంపై పెద్ద యెత్తున చర్చ జరుగుతోంది. ఇప్పుడు ఎమ్మెల్సీలుగా ఎంపిక చేసిన కమ్మ సామాజికవర్గం నేతలిద్దరికీ వారి నియోజకవర్గాల్లోనూ బలం లేదంటున్నారు. జగన్ కమ్మ సామాజికవర్గానికి ఈసారి రెండు పదవులు ఇచ్చారు. వారిలో తలశిల రఘురాం ఒకరు. ఆయన ఇప్పటికే కేబినెట్ హోదాలో ఉన్నారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల అమలును ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఇక మరొక నేత ప్రకాశం జిల్లాకు చెందిన తూమాటి మాధవరావు. ఈయన కందుకూరు నియోజకవర్గంలో 2017 ప్రాంతంలో వైసీపీ సమన్వయకర్తగా పనిచేశారు. పార్టీలో ఉన్నప్పటికీ ఆయన ఆ సామాజికవర్గంలో బలమైన నేత కాదు. అన్నీ ఆయన కుటుంబానికేనా? ఇక గంటూరు జిల్లాలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు మరోసారి ఎమ్మెల్సీ పదవి రెన్యువల్ అయింది. ఆయన కుటుంబానికి ఎన్ని పదవులు ఇస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఉమ్మారెడ్డి ఒకసారి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ప్రభుత్వ విప్ గా కూడా చేశారు. ఇప్పుడు మరోసారి ఎమ్మెల్సీని చేశారు. ఆయన అల్లుడు కిలారు రోశయ్య పొన్నూరు వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. గత ఎన్నికలలో ఉమ్మారెడ్డి అల్లుడి వియ్యంకుడికి టిక్కెట్ ఇచ్చారు. అన్నీ పదవులు ఆ కుటుంబానికే అయితే ఎలా అన్న ప్రశ్న వినపడుతుంది. వైసీపీని తొలి నుంచి నమ్ముకుని ఉన్న రావి వెంకటరమణకు జగన్ హ్యాండ్ ఇచ్చారు. సంగం డెయిరీ విషయంలోనూ ఆయన కీలక ఆధారాలను జగన్ కు చేర్చారంటారు. ఆయనకు కేవలం పొన్నూరులోనే కాకుండా గుంటూరు, ప్రత్తిపాడులో బలమైన వర్గం ఉంది. ఆయనను కాదని కమ్మ సామాజికవర్గం కింద ప్రకాశం, కృష్ణా జిల్లాల నేతలను ఎంపిక చేయడంపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. బలమై క్యాడర్ ఉన్న రావి వెంకటరమణకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదన్న అసంతృప్తి వైసీపీలోఉంది.మంగళగిరిలోనూమురుగుడు హన్మంత రావుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై అసంతృప్తి ఉంది. ఆ పార్టీ నేత మునగాల మల్లేశ్వరరావు ఫైర్ అయ్యారు. పదవులను అనుభవించిన వారికి, అవినీతి ఆరోపణలున్న వారికి ఎలా పదవి ఇస్తారన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఆప్కో ఛైర్మన్‌గాఅవినీతికిపాల్పడిన వ్యక్తికి ఎమ్మెల్సీ పదవి ఎలా ఇస్తారని నిలదీస్తున్నారు.

# సామాజిక వర్గాన్నే నమ్ముకున్న జనసేన

రాజమండ్రి, నవంబర్ 1, (న్యూస్ పల్స్) జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈసారి కాపు ఓటు బ్యాంకు పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తనకు ఈసారైనా కాపు సామాజికవర్గం అండగా నిలుస్తుందని భావిస్తున్నారు. కానీ హరిరామ జోగయ్య తప్పించి పవన్ కల్యాణ్ పిలుపునకు పెద్దగా స్పందన కన్పించడం లేదు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన సభలో పవన్ కల్యాణ? కాపులంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలను ఏకతాటిపైకి తీసుకురావాల్సిన బాధ్యత కాపు సామాజికవర్గం పెద్దలపై ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏకం కావాలంటూ... రాజ్యాధికారం కావాలంటే సంఘటితం కావడం ఒక్కటే మార్గమని పవన్ కల్యాణ్ తెలిపారు. వీరి ఐక్యత కోసం కాపు పెద్దలు కృషి చేయాలని కోరారు. కానీ కాపు సామాజకవర్గం పెద్దల నుంచి పవన్ పిలుపునకు రెస్పాన్స్ పెద్దగా లేదు. ఒక్క హరిరామ జోగయ్య కాపు సంక్షేమ సేన పేరుతో కొంత హడావిడి చేస్తున్నారు. కాపు రిజర్వేషన్ల ను రాష్ట్రంలో అమలు చేయాలంటూ ఆయన ముఖ్యమంత్రి జగన్ కు లేఖ రాశారు. గత ఎన్నికల్లో కాపులు ఎక్కువగా వైసీపీ వైపు నిలిచారు. చంద్రబాబు పాలనపై విసుగుచెంది ఉండటం, పవన్ కల్యాణ? పై నమ్మకం లేకపోవడంతో జగన్ కు మెజారిటీ కాపు సామాజికవర్గం అండటగా నిలిచింది. కానీ ఏపీలో అత్యధికంగా ఉన్న కాపు సామాజికవర్గాన్ని గంపగుత్తగా తన వైపునకు నిలుపుకునేందుకు పవన్ కల్యాణ్ పరోక్షంగా అన్ని ప్రయత్నాలను మొదలు పెట్టేశారంటున్నారు. ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కాపు పెద్దలను త్వరలో నేరుగా కలవాలని నిర్ణయించారు. వచ్చే ఎన్నికల్లో జనసేన గెలుపు ఎంత అవసరమో వారికి పవన్ కల్యాణ్ వివరించనున్నారు. వైసీపీ ప్రభుత్వం కాపుల పట్ల వ్యవహరిస్తున్న తీరును కూడా ఆయన చెప్పనున్నారు. వచ్చే ఎన్నికల్లో మిగిలిన పార్టీల నుంచి కాపు అభ్యర్థులు నిలబడినా జనసేన నుంచి పోటీ చేసిన వారినే అసలైన కాపులుగా గుర్తించాలని కూడా ఆయన కోరనున్నట్లు తెలిసింది. త్వరలోనే ఈ సమావేశం జరగవచ్చని పార్టీలో చర్చ జరుగుతోంది.

# మళ్లీ కాంగ్రెస్ తో టీడీపీ చేతులు..



విజయవాడ, నవంబర్ 15, ఏదేమైనా చంద్రబాబుకు కాంగ్రెస్ వాసనలు పోవడం లేదు. ఆ పార్టీ నుంచే రాజకీయంగా ఎదిగి వచ్చారు కాబట్టి..ఆ పార్టీతో పరోక్షంగా సన్నిహితంగానే మెలుగుతూ వస్తున్నట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో చంద్రబాబు ఎలా ఎదిగారు..ఆ తర్వాత టీడీపీలోకి ఎలా వచ్చారనే విషయాలు అందరికీ తెలిసిందే. అయితే ఎన్టీఆర్ టీడీపీ పెట్టింది కాంగ్రెస్ వ్యతిరేక పునాదులపై..కానీ చంద్రబాబు మాత్రం కాంగ్రెస్ పునాదుల నుంచే టీడీపీలోకి వచ్చారు.అందుకే ఆయన కాంగ్రెస్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లోనే ఉంటారని విశ్లేషకులు చెబుతూ ఉంటారు. ఇక రాష్ట్ర విభజన జరిగాక రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పరిస్తితి ఘోరంగా తయారైంది. అయితే తెలంగాణలో కొద్దో గొప్పో పటిష్టంగా ఉంది. కానీ 2018 ఎన్నికల్లో చరిత్రలో తొలిసారిగా కాంగ్రెస్‌తో బాబు ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకున్నారు. ఇక ఆ పొత్తు పూర్తిగా విఫలమైన విషయం తెలిసిందే. ఆ తర్వాత కేంద్రంలో కూడా బీజేపీని ఓడించాలని చెప్పి కాంగ్రెస్‌తో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగారు.దాని వల్ల ఏపీలో టీడీపీ ఎలా దెబ్బతిందో చెప్పాల్సిన పని లేదు. ఘోరంగా ఓడిపోయి ప్రతిపక్షానికి పరిమితమైంది. అటు కేంద్రంలో కాంగ్రెస్ కూడా ఘోరంగా ఓడిపోయింది. అయినా సరే చంద్రబాబు, కాంగ్రెస్‌తో కాస్త సన్నిహితంగానే ఉంటున్నట్లు కనిపిస్తోంది. ఇక్కడ ఏపీలో బాబు, జగన్ ప్రభుత్వంపై తీవ్రంగా పోరాడుతున్న విషయం తెలిసిందే. ఇక బాబు బాటలోనే ఏపీ కాంగ్రెస్ నేతలు సైతం జగన్‌పైనే విమర్శల వర్షం కురిపిస్తున్నారు. అంటే పరోక్షంగా బాబుకు బెనిఫిట్ అయ్యేలా చేయాలని చూస్తారు.అలా చేస్తే నెక్ట్స ఎన్నికల్లో మళ్ళీ తమతో కలిసే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ భావిస్తోంది. ఒకవేళ బీజేపీతో పొత్తు సెట్ కాకపోతే?కాంగ్రెస్ తోనే బాబు ముందుకెళ్లే అవకాశం ఉంది. రాష్ట్ర స్థాయిలో పొత్తు లేకపోయినా కేంద్ర స్థాయిలో కాంగ్రెస్‌కు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అయితే ఈ సారి ఏమన్నా తేడా జరిగితే?టీడీపీ పూర్తిగా నాశనం అవ్వడం ఫిక్స్.

# కరెంట్ కష్టాలకు ఫుల్ స్టాప్.. ఎప్పుడు

విజయవాడ, నవంబర్ 15, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే.. జగన్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. సెకీ నుంచి సౌర విద్యుత్ కొనుగోలుకు ఏపీ ఈఆర్సీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోళ్లకు ఏపీ డిస్కంలకు ఏపీ ఈఆర్సీ అనుమతి ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. 2024 సెప్టెంబర్ నుంచి పాతికేళ్ల పాటు ఏడాదికి 17 వేల మిలియన్ యూనిట్ల మేర సెకీ నుంచి కొనుగోలు చేస్తామన్న ప్రతిపాదనలకు ఈఆర్సీ ఆమోదం తెలిపింది. సెప్టెంబర్ 2024 నాటికి 3 వేల మెగావాట్లు, సెప్టెంబర్ 2025 నాటికి మరో 3 వేలు, సెప్టెంబర్ 2026 నాటికి వేయి మెగా వాట్ల మేర సెకీ నుంచి కొనుగోలు చేసేందుకు ఈఆర్సీ అనుమతి ఇచ్చింది. సౌర విద్యుత్ కొనుగోళ్ల విషయంలో త్రైపాక్షిక ఒప్పందానికి ఏపీ ఈఆర్సీ ఆమోదం తెలిపింది. నెట్ వర్క్ ఛార్జెసు ను ప్రభుత్వం నుంచి క్లైమ్ చేసుకోవాల్సిందిగా ఏపీ ఈఆర్సీ సూచన లు చేసింది.

# కుప్పంలో ఫిర్యాదుల వెల్లువ

విజయవాడ, నవంబర్ 15, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. ముఖ్యంగా చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీలో ఎన్నికలు హీట్ పెంచాయి. దొంగ ఓటర్లు కుప్పంలో ఉన్నారని టీడీపీ ఆరోపిస్తుంటే.. అదేం లేదని వైఎస్సార్‌సీపీ చెబుతోంది. ఒకరిపై మరొకరు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నారు. టీడీపీ దొంగ ఓటర్లు, వైఎస్సార్‌సీపీ అక్రమాలు చేస్తోందని ఆరోపించింది.. ఎస్ఈసీకి ఫిర్యాదు చేసింది. తాజాగా టీడీపీ, చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ ఎన్నికల సంఘానికి కంప్లైంట్ ఇచ్చింది.రాష్ట్రంలో జరుగుతున్న స్థానికసంస్థల ఎన్నికలలో టీడీపీ నేతలు, నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అనేక అక్రమాలకు తెగబడుతున్నారని ఆరోపించారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాలలో, ఆ పార్టీ డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచారన్నారు. కుప్పం మున్సిపాలిటీలో చంద్రబాబు ఆదేశాలతో చిత్తూరు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఓటర్లను భయపెట్టెలా, దౌర్జన్యాలకు పాల్పడిన వీడియోలు, ఆడియోలు సోషల్ మీడియాలోనూ, ప్రసార మాధ్యమాలలో ప్రచారం అయ్యిందన్నారు. మున్సిపాలిటీలోనూ ఓడిపోతున్నామనే ఆలోచనతో ప్రశాంతంగా జరుగుతున్న ఎన్నికలను అలజడులు సృష్టించడం ద్వారా శాంతి భద్రతల సమస్యగా తీసికొని వచ్చి ఏదో ఒకవిధంగా ఎన్నికల ప్రక్రియను ఆటంకాలు కలిగించేందుకు మధ్యాహ్నం చంద్రబాబు కుప్పం చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి చంద్రబాబు నాయుడు స్వగ్రామం నారావారిపల్లె.. కుప్పం ఓటరు కూడా కాదు.. ఓటు మంగళగిరి నియోజకవర్గంలో ఉందన్న విషయాన్ని గమనించాలని కోరారు.ఎన్నికల ప్రచారం ముగిసినా ఈ ఉదయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కుప్పం ఓటర్లతో ఆయన మాట్లాడటం, విద్వేషాలను రెచ్చగొట్టేందుకు, అలజడులు సృష్టించే ప్రయత్నాలు, రాష్ట్ర ప్రభుత్వం పన్నులు పెంచుతున్నారనే విమర్శలు చేశారన్నారు. అదేవిధంగా ఓటర్లను భయపెడుతూ ప్రలోభపెట్టే విధంగా మాట్లాడుతున్న విషయం ఎస్ఈసీకి వివరించారు

# అనంతలో రెండింటిపై గురి

అనంతపురం, నవంబర్ 15, (న్యూస్ పల్స్) అనంతపురం జిల్లాలో వైసీపీ గత ఎన్నికల్లో రెండు సీట్లను కోల్పోయింది. ఒకటి ఉరవకొండ కాగా, రెండోది హిందూపురం నియోజకవర్గాలు. ఉరవకొండలో పయ్యావులు కేశవ్, హిందూపురంలో బాలకృష్ణలు గెలిచారు. ఈ రెండింటిని వచ్చే ఎన్నికల్లో గెలుచుకునేదిశగా జగన్ పదవుల పంపకాన్ని చేపడుతున్నట్లు అర్థమయింది. తాజాగా ఉరవకొండకు చెందిన శివరామిరెడ్డిని ఎమ్మెల్సీ పదవికి జగన్ ఎంపిక చేశారు. గతంలోనే జగన్ హిందూపురం నియోజకవర్గ వైసీపీ ఇన్ ఛార్జి మహ్మద్ ఇక్బాల్ కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. అక్కడ పార్టీలో కీలక నేతగా ఉన్న నవీన్ నిశ్చల్ కు నామినేటెడ్ పోస్టు ఇచ్చారు. హిందూపురంలో వీరిద్దరూ కలసి పార్టీని బలోపేతం చేసే దిశగా జగన్ పదవులను కీలక నేతలకు ఇచ్చారు. మొన్నటి వరకూ రెండు గ్రూపులుగా ఉన్న హిందూపురం నియోజకవర్గంలో పదవుల భర్తీతో కొంత పార్టీ గాడిలో పడినట్లే కన్పిస్తుంది. మరొక నియోజకవర్గమైన ఉరవకొండలో కూడా రెండు గ్రూపులు బలంగా ఉన్నాయి. ఇద్దరూ వైసీపీలో తొలి నుంచి నమ్మకంగా ఉన్న వారే. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయిన విశ్వేశ్వర్ రెడ్డి ఎమ్మెల్సీ పదవిని ఆశించారు. కానీ జగన్ ఆలోచన 2024 ఎన్నికల్లో అక్కడి నుంచి పోటీ చేయించాలన్నది. అక్కడ శివరామిరెడ్డి వర్గం కూడా బలంగా ఉంది. గత కొంతకాలంగా రెండు గ్రూపులు పార్టీ అధినాయకత్వానికి తలనొప్పిగా మారాయి. ఈయనకు ఉరవకొండ వైసీపీ ఇన్ ఛార్జిగా విశ్వేశ్వర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. శివరామిరెడ్డికి ఇప్పుడు ఎమ్మెల్సీ ఇచ్చి జగన్ ఆయనకు గౌరవం ఇచ్చారు. ఇప్పుడు రెండు గ్రూపులు కలసి పార్టీని ఉరవకొండలో బలోపేతం చేయాలని ఆదేశించారు. ఉప్పు నిప్పులా ఇప్పటి వరకూ రెండు వర్గాలు కొనసాగాయి. ఇప్పటికైనా రెండు వర్గాలు కలసి వచ్చే ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఆ నియోజకవర్గం పార్టీ క్యాడర్ కోరుకుంటోంది.

# రెండవ కార్తిక సోమవారం..



రామచంద్రపురం తూర్పుగోదావరి జిల్లా రామచం ద్రపు రం మండలం ద్రాక్షా రమం.లో కొలువై ఉన్న శ్రీమాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వ రస్వామి దేవస్థానం. పంచారామ క్షేత్రలలో ఒకటి ఈరోజు కార్తీక సోమవారం కావున భక్తులతో శివనామస్మరణతో మారుమ్రోగింది. తెల్లవారుజాము నుండి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని అమ్మవారిని దర్శించుకోవడానికి క్యూ లైన్లలో బారులు తీరారు. అర్చకులు,వేద పండితులు ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.కార్తీకమాసం రెండవసోమవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శినం కొరకు తరలి వస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపారాధనలు చేసియున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు ఏర్పాటుచేసి థర్డ్ వేవ్ ముప్పు ఉన్నందువలన కోవిడ్ నిబంధనలు పాటిస్తూ. అలాగే చిన్నపిల్లలను మరియు 60 సంవత్సరాలు పైబడిన వారిని దర్శనానికి తీసుకురావద్దనిభక్తులనుకోరారు.స్వామివారుఉచితదర్శనానికి తెల్లవారుజాము న 4గంటలనుంచి రాత్రి 9 గంటల వరకు. ఉంటుందని స్వామి శీఘ్ర దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ అధికారులు తెలియజేశారు.

# ప్రైవేటు బస్సు బోల్తా.. ఐదుగురికి గాయాలు

అనంతపురంఅనంతపురం జిల్లా మండలం కోడూరు తోపు సమీపాన బస్సు బోల్తా పడింది. ఘటనలో ఐదు మందికి గాయాలు అయ్యాయి. వారిని బాగేపల్లి ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ తలకు తీవ్రగాయం అయినట్లు సమాచారం. సోమవారం తెల్ల వారు జాము 5 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ముందు వెలుతున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం జరిగినట్లు సమాచారం. గ్రీన్ లైన్ ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుండి బెంగుళూరుకు వెలుతుంద. బస్సులో బస్సులు 35 మంది ప్రయాణికులు వున్నారు.

# ఎమ్మెల్సీ కోసం ఎదురుచూపులు- నిరాశలు

విజయవాడ, నవంబర్ 15, (న్యూస్ పల్స్)అధికార పార్టీ అన్నాక పదవుల విషయంలో పోటీ ఎక్కువగా ఉంటుందనే విషయం తెలిసిందే. ఒక పొజిషన్‌లో ఉన్న నాయకులు ఏదొక పదవి రాకపోకుండా ఉంటుందని ఆశగా ఎదురుచూస్తారు పదవి వస్తే బాగానే ఉంటుంది రాకపోతే మాత్రం అలకపాన్పు ఎక్కేస్తారు. తాజాగా ఏపీలో అధికారంలో వైసీపీలో ఇదే పరిస్తితి వచ్చేలా ఉంది. ఎందుకంటే తాజాగా సీఎం జగన్ ఎమ్మెల్యే కోటాలో 3, స్థానిక సంస్థల కోటాలో 11 ఎమ్మెల్సీ స్థానాలని భర్తీ చేశారు. అంటే మొత్తం 14 స్థానాలని భర్తీ చేశారు. ఆ 14 మంది సభ్యులని కూడా ప్రకటించేశారు. అయితే ఈ 14లో తమ పేరు కూడా ఉంటుందని పలువురు నేతలు ఆశించారు. తీరా పేరు లేకపోయేసరికి నిరాశలో మునిగిపోయారు. తాజాగా స్థానిక సంస్థల్లో 11 మందిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఖరారు చేశారు. విజయనగరం జిల్లా నుంచి ఇందుకూరి రఘురాజు, విశాఖపట్నం జిల్లా నుంచి వరుదు కల్యాణి, వంశీకృష్ణ యాదవ్, తూర్పుగోదావరి జిల్లా నుంచి అనంతబాబు, కృష్ణా జిల్లా నుంచి తలశిల రఘురాం, మొండితోక అరుణ్ కుమార్, గుంటూరు జిల్లా నుంచి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మురుగుడు హనుమంతరావు, ప్రకాశం జిల్లా నుంచి కందుకూరు నుంచి టి మాధవరావు, చిత్తూరు జిల్లా నుంచి భరత్, అనంతపురం నుంచి వై.శివరామిరెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించారు. అయితే టీడీపీకి స్థానిక సంస్థల్లో బలం లేకపోవడంతో ఈ 11 స్థానాలు వైసీపీ ఖాతాలోనే పడనున్నాయి.అయితే పదవులు రాకపోవడంపై కొందరు సీనియర్లు గుర్రుగా ఉన్నారని తెలుస్తోంది. గుంటూరు జిల్లాలో సీనియర్ నేత మర్రి రాజశేఖర్ పదవి వస్తుందని ఆశించి భంగపడ్డారు. గత ఎన్నికల్లో జగన్,? ఈయనకు ఎమ్మెల్సీ, మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ మంత్రి పదవి పక్కనబెట్టిన ఎమ్మెల్సీ కూడా ఇవ్వలేదు. కొత్తగా పార్టీలోకి వచ్చిన మురుగుడు హనుమంతరావుకు పదవి ఇవ్వడంపై మర్రి వర్గం తీవ్ర అసంతృప్తిగా ఉంది.అటు సీనియర్ నేత దాడి వీరభద్రరావు సైతం పదవి ఆశించారు? కానీ ఆయనకు కూడా నిరాశే ఎదురైంది. ఇటు వల్లభనేని వంశీ ప్రత్యర్థులుగా పోటీ చేసి ఓడిపోయిన యార్లగడ్డ వెంకట్రావు, దుట్టా రామచంద్రరావులు సైతం పదవి ఆశించారు. వంశీని టీడీపీ నుంచి వైసీపీలోకి తీసుకోవడంతో, తమకు ఎమ్మెల్సీలు వస్తాయని అనుకున్నారు. కానీ వీరికి కూడా నిరాశే ఎదురైంది.

# బ్రాండ్ అంబాసిడర్ కోసం యత్నాలు

విజయవాడ, నవంబర్ 15, వంగవీటి రాధా వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఆయన పోటీ ఎక్కడి నుంచి చేస్తారన్నది పక్కన పెడితే కాపు సామాజికవర్గంలో బలమైన నేతగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారు. తాను కాపు సామాజికవర్గానికి బ్రాండ్ అంబాసిడర్ ని అని చెప్పుకునే పనిలో పడ్డారని చెప్పక తప్పదు. వంగవీటి రాధా వరసగా కాపు సామాజికవర్గం సమావేశాలకు హాజరవుతుండటమే ఇందుకు ఉదాహరణ. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆయన ప్రజల్లో ఉండేదుకు ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారని రంగా అభిమానుల్లో కూడా ఆనందం వ్యక్త మవుతుంది. పట్టున్న నేతగా.... వంగవీటి రంగా తర్వాత కాపు సామాజికవర్గానికి ఏపీలో ముఖ్యమైన నేత కన్పించలేదు. ముద్రగడ పద్మనాభం ఒకింత ఆ సామాజికవర్గాన్ని ప్రభావం చేసే నేతగా కన్పించినా ఆయన మధ్యలో కాడి వదిలేయడంతో ఇప్పుడు ఆయనకు పట్టు లేదు. హరిరామ జోగయ్యను కాపులే ఓన్ చేసుకోవడం లేదు. పవన్ కల్యాణ్ వంటి నేతలు రాజకీయ అవసరాల కోసం కాపు ముద్ర పడకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో వంగవీటి రాధా తాను ఆ సామాజికవర్గంలో పట్టున్న నేత అని నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నారు. పార్టీయే ఇబ్బందా? వంగవీటి రాధా కు పార్టీయే అడ్డంకిగా మారినట్లు కనపడుతుంది. తన తండ్రి వంగవీటి రంగాను హత్య చేసింది అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కాబట్టి ఆ పార్టీ లో ఉంటే వంగవీటి రాధా కాపుల్లో మద్దతు దొరకడం కష్టంగానే కన్పిస్తుంది. రాధా ఇప్పటి వరకూ అనేక పార్టీలు మారినా పెద్దగా అభ్యంతరం పెట్టని కాపు నేతలు టీడీపీలో ఉండటాన్ని పరోక్షంగా తప్పు పడుతున్నారు. దీనిని గ్రహించిన వంగవీటి రాధా మరోసారి పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. టీడీపీలోనే ఉంటే....? టీడీపీలో కూడా వంగవీటి రాధా సంతోషంగా లేరన్నది



వాస్తవం. ఆ పార్టీ పరిస్థి?తి బాగా లేకపోగా ఆ పార్టీ బీఫారంపై పోటీకి దిగితే మరోసారి ఓటమి తప్పదని వంగవీటి రాధా భయపడుతున్నారు. ఆయనకు ఇప్పుడు జనసేన తప్ప వేరే ఆప్షన్ లేదు. జనసేన అయితేనే తనను కాపు సామాజికవర్గం మరింత దగ్గరకు తీసుకుంటుందన్న భావనలో వంగవీటి రాధా ఉన్నారు. జనసేనలోకి జంప్ చేస్తే రాజకీయ భవిష్యత్ ఎలా ఉంటుందన్న దానిపై వంగవీటి రాధా ముఖ్య అనుచరులతో మంతనాలు జరుపుతున్నారు

# పెండింగ్లో ఉన్న జీతాలు చెల్లించాలి

## సిఐటియు ప్రతినిధి బృంద ఏడీకి వినతి పత్రం



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రేడియో గ్రాఫర్, పంపు ఆపరేటర్, ల్యాబ్ టెక్నీషియన్ ,ఏఎన్ఎం ఇలా పలు రకాలుగా వివిధ విభాగాల్లో పని చేస్తున్నటువంటి 83 మందికి, అలాగే సెక్యూరిటీ గార్డ్స్, అలాగే స్వీపర్స్ ,సిబ్బందికి పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వాలని సిఐటియు ప్రతినిధి బృందం ఏడి గారికి కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. గత ఆరు నెలలుగా జీతాలు లేక ఇల్లు గడవని ,స్థితిలో కార్మికులు దిగిపోయారు. అప్పుల పాలయ్యారని బాడుగాఇళ్లవాళ్ళు మరీ ఎక్కువ ఇబ్బంది పడుతున్నారని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు సిఐటియు నగర కార్యదర్శి విజయ్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ బాబు ,సీఐటీయూ నగర నాయకులు ముహమ్మద్ షరీఫ్, రామకృష్ణ బృందంతో కలిసిపోయి ఏడి గారికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్ వేధింపులు సూపర్వైజర్ ల వేధింపులు చాలా ఎక్కువ అయ్యాయని మానసికంగా ఎంతో మంది కి ఇబ్బంది కలిగిస్తున్నారని వారు ఆరోపించారు. తక్షణమే వారిపై కఠినమైన చర్యలు తీసుకొని కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వాలని స్వీపర్స్ కాంట్రాక్టర్ జీ1 ఏజెన్సీ తీసుకున్న తర్వాత ఒక్కొక్కరికి నెలకు 16 వేల రూపాయల తో పాటు 3నెలల పాటు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు ఏజెన్సీ అతనే చెల్లించాల్సి ఉంది. అయినప్పటికీ అతను చెల్లించక పోగా కార్మికులకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి పై అధికారుల, ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెళ్లి మా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ మీ సమస్యల పరిష్కారం కోసం పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్ కి గాని, సూపర్వైజర్లకుగాని డ్యూటీ నుండి తొలగించే అధికారం లేదని కార్మికులు ఎవరు భయపడాల్సిన పని లేదని ఆయన తె?యజేశారు అలా వ్యవహరిస్తే వారిపై తగు చర్యలు తీసుకొంటాం అని అయన హామీ ఇచ్చారు.

# ఢిల్లీలో లాక్ డౌన్ దిశగా అడుగులు

న్యూఢిల్లీ, నవంబర్ 15, (న్యూస పల్స్) దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. అయితే ఈ సందర్భంగా తాము లాక్‌డౌన్‌కు సిద్ధంగా ఉన్నట్టు సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది ఢిల్లీ సర్కార్. అయితే, కాలుష్య నియంత్రణకు ప్రభుత్వానికి మూడు మార్గాలను సూచించింది సుప్రీం కోర్టుక్రాకర్స్ కాల్చడం, పంట దగ్ధం సహా పలు కారణాలతో దేశ రాజధానిలో ఎయిర్ పొల్యూషన్ డేంజర్ లెవెల్స్‌ను కూడా క్రాస్ చేసింది. ప్రపంచవ్యాప్తంగా కాలుష్య నగరాల్లో ఫస్ట్ ప్లేస్‌లో నిలిచింది ఢిల్లీ. దీంతో ప్రమాదకర స్థాయిని దాటి పెరిగిపోయిన కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు..కాలుష్య నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అవసరమైతే రెండ్రోజులు లాక్‌డౌన్ అంశాన్ని పరిశీలించాలని సూచించింది.ఈ నేపథ్యంలో తాము లాక్‌డౌన్‌కు సిద్ధంగా ఉన్నామని సుప్రీంకోర్టుకు తెలిపింది కేజ్రీవాల్ ప్రభుత్వం. అయితే, పొరుగు రాష్ట్రాల్లోనూ లాక్‌డౌన్ విధిస్తేనే..ఫలితం ఉంటుందని కోర్టుకు తెలిపింది.ఢిల్లీ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో, "స్థానిక వాయు కాలుష్యాన్ని నియంత్రించడానికి పూర్తి లాక్‌డౌన్ వంటి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉంది" అని పేర్కొంది. "అయితే, ఎన్‌సీఆర్ పొరుగు రాష్ట్రాల అంతటా అమలు చేస్తే అలాంటి చర్య అర్థవంతంగా ఉంటుందని ప్రభుత్వం తెలిపింది.వాయు కాలుష్యం పెరగడాన్ని "అత్యవసర పరిస్థితి" అని గతంలో సుప్రీంకోర్టు పేర్కొన్నది. కీలకమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. "ఢిల్లీ కాంపాక్ట్ సైజు దృష్ట్యా, లాక్‌డౌన్ గాలి నాణ్యతపై పరిమిత ప్రభావాన్ని చూపుతుంది" అని అఫిడవిట్‌తో సమర్పించిన వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రభుత్వం తన వివరణాత్మక కార్యాచరణ ప్రణాళికలో పేర్కొంది.ఢిల్లీతో పాటు చుట్టుపక్క ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వారం రోజుల పాటు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దీనికి సంబంధించి కార్యాచరణ చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోర్టు కోరింది. విషపూరితంగా మారిన వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు మంగళవారం సమావేశమై కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. లాక్‌డౌన్ పెడితే కొంత వరకు కాలుష్యాన్ని తగ్గించే అవకాశం ఉందని గత విచారణలో సీజే ఎన్వీ రమణ పేర్కొన్న విషయం తెలిసిందే.మరోవైపు, ఢిల్లీకి సరిహద్దు రాష్ట్రాలైన హర్యానా, పంజాబ్‌లలో వ్యవసాయ మంటల నుండి వెలువడున్న కాలుష్యం కాస్త తగ్గడంతో ఢిల్లీలో ఆదివారం 24 గంటల సగటు వాయు నాణ్యత సూచిక (ఏక్యూఐ) 330 నమోదైంది. ఏక్యూఐ శుక్రవారం దాదాపు 471 వద్ద ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు నమోదైన గాలి నాణ్యతలో ఇదే అత్యధికం. అయితే, కాలుష్యాన్ని అరికట్టేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. అదనంగా, గాలి నాణ్యత సూచికను మెరుగుపరచడానికి సగటున 500 కంటే ఎక్కువ ఉన్న ప్రస్తుత స్థాయి నుండి కనీసం 200 పాయింట్లకు తగ్గించడానికి తీసుకోవలసిన చర్యలను కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది.అంతకుముందు శనివారం, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం నుండి ఢిల్లీలోని పాఠశాలలను ఒక వారం పాటు మూసివేస్తున్నట్లు ప్రకటించారు .

# అనంతలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు?

**రాకపోకలకు తీవ్ర అంతరాయం?.**

అనంతపురం నవంబర్ 15, (న్యూస్ పల్స్)అనంతపురం జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని బుక్క పట్నం నుంచి ముదిగుబ్బ వెళ్లే ప్రధాన రహదారి వర్షపు నీటికి కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చంద్రాయన పల్లి బుచ్చయ్య గారి పల్లి మధ్య నీటి ప్రవాహానికి రోడ్డు కోతకు గురికావడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. బుక్కపట్నం ఎస్సై నర్సింహుడు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా వాహనాలను దారి మళ్లిస్తున్నారు.రోడ్డు మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు ద్విచక్ర వాహనాలు మినహా ఏ ఇతర వాహనాలు ఈ దారి గుండా ప్రయాణం సాగించి కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే అథారిటీ ఉన్నతఅధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డును పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టే అవకాశం ఉన్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.భారీ వర్షానికి రోడ్డు దెబ్బతిని ఉందా లేదా హంద్రీనీవా వాటర్ కు సంబంధించి బ్రిడ్జి కింద లింక్ సరిగా లేకపోవడం వల్ల నీటి ప్రవాహం పెరిగి దెబ్బతిందా అన్న కోణంలో పరిశీలించి తగిన మరమ్మతు పనులు చేయనున్నారు

# సిరి ధాన్యాలతో ఆరోగ్యం

అనంతపురంనవంబర్ 15, (న్యూస్ పల్స్) జిల్లా నల్లమాడ లో సిరిధాన్యాల సాగు వాడకం ప్రజారోగ్యంపై ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఖాదరవల్లి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా సిరి దాన్యాలు ఎలా వాడాలి,సిరి ధాన్యాల వాడడం వల్ల కలిగే లాభాలను ఆయన రైతులకు తెలియజేశారు.సిరి ధాన్యాలు వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి క్లుప్తంగా వివరించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెద్ద పెద్ద బహుళజాతి కంపెనీలకు ప్రభుత్వాలు లోబడి పారిశ్రామిక ఆహారానికి జనాలను అలవాటు చేస్తున్నాయన్నారు. చిరుధాన్యాల తినడం వల్ల కలిగే ప్రయోజనాలను ఎవరూ చెప్పడం లేదు. రిఫైన్డ్ ఆయిల్ వాడటం వల్ల అనేక మంది పిల్లలు బుద్ధిమాంద్యం లోపంతో బాధపడుతున్న ట్లు తెలిపారు. రాజకీయ నాయకులు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయాలు బహుళజాతి కంపెనీలకు లొంగి ఆరోగ్యకరమైన ఆహారం గురించి చెప్పడం మానేశాయన్నారు. మన దేహం లో విటమిన్ బి, విటమిన్ సి, విటమిన్ డి లోపం వల్ల అనేక సంక్రమిత రోగాలు వస్తున్నాయని ఈ విటమిన్ లోపాన్ని అధిగమిస్తే ఈ రోగాలను జయించవచ్చు అన్నారు. రసాయన పురుగు మందుల వాడకం వల్ల భూమికి కలిగే నష్టాలు, ఆ తిండి గింజలు తినడం వల్ల కలిగే దుష్పరిణామాల పై ఖాదర్ వలి వివరించారు. మనం తినే తిండి గింజల్లో పురుగుమందుల అవశేషాలు అధికంగా ఉండడం వల్లే రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. రైతు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులేసిన పుడు ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. సిరి ధాన్యాలు సాగు,వాడకం వల్ల ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు.

# ఎంపీ, ఎంపీతండ్రిని ఆరెస్టు చేయాలి

విజయవాడ నవంబర్ 15, (న్యూస్ పల్స్) వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో ఎంపి అవినాష్రెడ్డి, అతని తండ్రి భా స్కర్రెడ్డి, సిఎం జగన్ కుటుంబానికి పాత్ర ఉన్నట్లు దస్తగిరి వాగ్మూలంతో స్పష్టమైందని, వారందరిని అరెస్టు చేయాలని మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు డిమాండ్ చేశారు. వివేకా హత్య కేసు గురించి అమిత్షాతో ఏం మాట్లా డారో జగన్ చెప్పాలన్నారు.టిడిపి హయాంలో ఈ కేసును రాష్ట్ర పోలీసు లు విచారిస్తుంటే జగన్ మాత్రం సిబిఐ విచారణ కోరారని,ఆయన సిఎం అయ్యాక వివేకా కుమార్తె సునీత సిబి ఐ విచారణ కోరితే జగన్ నిరాకరించా రని అన్నారు.ఆంజనేయులు మాట్లాడుతూ..శావల్యాపురంలో టిడిపి అభ్యర్థి గెలుస్తుందనే భయంతో వైసిపి నాయకులు బెదిరింపులకు పాల్పడు తున్నారని తెలిపారు.అభివృద్ధి చేయడం చేతకాని వైసిపి ప్రభుత్వాన్ని ప్రజ లు ఛీ కొడుతున్నారన్నారు.

# హూ కిల్డ్ బాబాయ్

విశాఖపట్నం నవంబర్ 15, (న్యూస్ పల్స్) మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మాజీ డ్రైవర్ దస్తగిరి ఇచ్చిన వాంగ్మూలం ప్రకంపనలు సృష్టి స్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ సీనియ ర్ నేత అయ్యన్నపాత్రుడు స్పందించా రు.హూ కిల్డ్ బాబాయ్ అనే ప్రశ్నకు సమాధానం దొరికిందని తెలి పారు. జగన్ అండ్ యూ కిల్డ్ వివేకా అని తేలిపోయింది విజయసాయిరెడ్డి అం టూ ట్వీట్ చేశారు.బాబాయ్ పై జగన్ రెడ్డి గొడ్డలిపోటును గుండెపోటు అని కవర్ చెయ్యబోయిన డాక్టర్ వీసా రెడ్డి అడ్డంగా దొరికిపోయాడని అయ్యన్న ఎద్దేవా చేశారు.సొంత బాబాయ్ హత్య జరిగిన రెం డున్నర సంవత్సరా లకు కూడా దర్యా ప్తు పూర్తి చేయలేదంటే జగన్ సీఎం పదవికి అర్హుడు కాదని మాజీ మంత్రి అయ్యన్నపాత్రు డు చెప్పారు.ముఖ్య మంత్రి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్టు డ్రైవర్ చెప్పారని,దీనిపై డీజీ పీ వారికీ నోటీ సులు ఇస్తారా అని ప్రశ్నించారు.దీనిపై జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాల ని,ఆంధ్ర రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని అన్నారు.రాష్ట్రంలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఘటన పై చర్యలు తీసుకోవాలని కోరారు.

# విశాఖలో సాఫీగా ఎన్నికలు

విశాఖపట్నం విశాఖ జీవీఎంసీలో 31, 61 వార్డులకు ఉప ఎన్నికలు జరిగాయి.సోమవారం ఉదయం 7 గంటలకు పోలిం గ్ ప్రారంభమైంది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకు నేందుకు పోలింగ్ కేంద్రాలవద్ద క్యూ కట్టారు. ఈ రెండు వార్డులకు సంబంధించి మొత్తం 29,052 మంది ఓటర్లు ఉన్నారు. 29 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంపీ విజయసాయి రెడ్డి 31వ వార్డు పరిధిలో పలు బూతులను సందర్శి స్తున్నారు. పోలింగ్ సరళిని ..స్థానిక వైసీపీ నేతలను అడిగి తెలుసుకుంటు న్నారు. ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ సమీపంకు వచ్చి..నేతలతో మాట్లాడి వెళ్లిపోయారు.మరోవైపు ఎన్నికల ప్రక్రియను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పరిశీలించారు.ఓటు హక్కును వినియోగంపై వస్తున్న అవగాహన నేపధ్యంలో జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు ప్రభుత్వంపై నమ్మకాన్ని తెలియచేస్తుందని ఆశాబావం వ్యక్తం చేశారు.ప్రజలు వైసీపీపై విశ్వాసం చూపిస్తారని ఆ పార్టీ నేత శివశంకర్ , ఆ పార్టీ మహిళా నేతలతో కలసి వచ్చిన ఆయన ... ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు.ప్రజా స్వామ్యాన్ని వైసీపీ దెబ్బకొడుతోందని,ప్రజలు ఇచ్చే తీర్పును దౌర్జన్యాలతో అడ్డుకొవడం సాద్యం కాదని,వైసీపీ నేతల ఆగడాలను ఎక్కడికక్కడ తిప్పికొడతామని హెచ్చరించారు.

## నేడు హెచ్ డి ఎస్ మొదటి సమావేశం



తుగ్గలి నవంబర్: 15( విభారె) .: మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక ప్రాథమిక వైద్యశాల యందు నేడు హెచ్డిఎస్ (హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ) మొదటి సమావేశంను ఏర్పాటు చేస్తున్నట్లు తుగ్గలి ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు. మంగళవారం రోజున నిర్వహించే హెచ్డిఎస్ మొదటి సమావేశాన్ని మండల అధ్యక్షురాలు ఆదెమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.మంగళవారం రోజున మధ్యాహ్నం 12 గంటలకు తుగ్గలి పీహెచ్సీ నందు హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ మొదటి సమావేశం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అభివృద్ధి కొరకు పలు అంశాలు చర్చిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ తెలియజేశారు.

## ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తాసిల్దార్ కు వినతిపత్రం

ఎమ్మిగనూరు నవంబర్: 15( విభారె) పట్టణంలోని ధనమే ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండ విచ్చల విడిగా దోపిడీ చేస్తున్న సిద్ధార్థ నలంద రావుస్ వైష్ణవి కళాశాలలు పై చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ స్టూడెంట్స్ ఫెడరేషన్ డిమాండ్. పట్టణంలోని తహశీల్దార్ జయన్నకు వినతి పత్రం అందఅందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ రాయల సీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న సిద్ధార్థ నలంద వైష్ణవి రావుస్ డిగ్రీ కళాశాలలు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కనీస మౌలిక వసతులు కూడ లేకుండా విచ్చల విడిగా దోపిడీ చేస్తున్న రాని ఈ కళాశాలలు పై యునివర్సిటి అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కళాశాలలో త్రాగునీటి బాత్రూం, ప్లే గ్రౌండ్ లేకుండా లైబ్రరీ క్వాలిఫైడ్ ఫాకల్టీ లేకుండా కనీసం విద్యార్థులకు సరిపడే గదులు లేకుండ అద్దె భవనాల్లో విద్యను బోధిస్తు కాలక్షేపం చేస్తు విద్యార్థుల నుండి వేలకు వేలు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ చేయాల్సిన యునివర్సిటీ సి.డి.సి సెక్షన్ వారు డిగ్రీ కళాశాలు దగ్గరకు కొచ్చి అమ్ముడు పోతున్నారని అన్నారు. దీనిపై స్పందించి డిగ్రీ కళాశాలలు పై విచారణ కమిటీ ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా వున్నటువంటి డిగ్రీ కళాశాలలును సీజ్ చేయాలనీ, లేదంటే యునివర్సిటీ ముట్టడి స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు మనోహర్ నవీన్ వినోద్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల ఉల్లంఘనకు కేరాఫ్ అడ్రస్..



### నంద్యాల టూ.టౌన్ పోలీస్ స్టేషన్ ... నవజ్యోతి హ్యూమన్ రైట్స్

నంద్యాల నవంబర్: 15( విభారె) మానవ హక్కుల ఉల్లంఘనకు కేరాఫ్ అడ్రస్ నంద్యాల 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రమణ అని ఆదివారం నాడు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నవజ్యోతి హ్యూమన్ రైట్స్ నంద్యాల డివిజన్ ప్రెసిడెంట్ దమాల నాగేంద్ర. మరియు వారి బృందం తనకు జరిగిన అన్యాయంపై షేక్ సోని అనే మహిళ నంద్యాల హిందుజా ఫైనాన్స్ వారిపైన నంద్యాల 2 టౌన్ పోలీస్ స్టేషన్ లో 12/10/ 2021 న ఫిర్యాదు చేయడం జరిగింది. అయితే అతి కష్టం మీద 15-10-2021 న కేసు నమొదుచేసారు.ఈ కేసును రాజీ చేసుకోమని నంద్యాల టు టౌన్ ఇన్స్పెక్టర్ రమణ అనేకమార్లు సోని అనే మహిళను బెదిరించడం కూడా జరిగింది.సోనీ వినకపోయేసరికి తిరిగి హిందుజా ఫైనాన్స్ వారిని ప్రోత్సహించి వారితో కంప్లైంట్ తీసుకొని తప్పుడు కౌంటర్ కేసు నమోదు చేయడం జరిగింది సోనీ తెలియజేయడం జరిగింది. ఈ విషయంపై 13/ 11/2021 శనివారం మధ్యాహ్నం 1:30 కి నంద్యాల టు టౌన్ ఇన్స్పెక్టర్ మరియు అతని బృందం మొత్తం 15 మంది మూడు వాహనాలలో వెళ్లి సోనీ మహిళ వాళ్ళ అమ్మని బెదిరించి వారింట్లో సోదాలు నిర్వహించి ఇంటికి సి.ఆర్.పి.సి 41 ఎ నోటీసు అతికించి ఫోటో తీసుకుని వెళ్లడం జరిగింది. ఆ నోటీసును పరిశీలించగా ఈ కేసు విషయమై సోని గారిని ఈ నెల 4వ తారీకున స్టేషన్ కి రావాలి అంటూ ఈనెల ఒకటో తారీఖున ఇన్స్పెక్టర్ నోటీసు ఇచ్చినట్లు అందులో ఉంది మరి 13 వ తారీకు నోటీసు అతికించి 4 వ తారీకు రమ్మంటే ఎలా వెళ్ళగలరు ఇది తప్పుడు నివేదిక ఇది ఇలా ఎందుకు చేశారంటే ఇప్పుడు అరెస్టు చూపిస్తూ రిమాండ్ కి పంపించాలనే ఉద్దేశ్యమే అవుతుంది ఇది మానవ హక్కుల ఉల్లంఘన కావున ఇప్పటికైనా నంద్యాల 2 టౌన్ పోలీసు వారు తన పద్ధతి మార్చుకో వలసిందిగా కోరుచున్నాము. నవజ్యోతి హ్యూమన్ రైట్స్ నంద్యాల డివిజన్ ప్రెసిడెంట్ డామల నాగేంద్ర ఈ సందర్భంగా వివరిస్తూ ఆల్రెడీ ఇప్పటికే సుప్రీంకోర్టు జస్టిస్ రమణ గారు కూడా మానవ హక్కుల ఉల్లంఘన పోలీస్ స్టేషన్లో జరుగుతుందని అనేక మార్లు చెప్పడం కూడా జరిగింది.ఇందుకు ఉదాహరణ ఇప్పుడు నంద్యాల టౌన్ పోలీసులు జారీ చేసినటువంటి తప్పుడు నోటీస్ ఏ కారణము కావున ఇప్పటికైనా మనవ హక్కులకు రక్షణ కల్పించ వలసినది గా నంద్యాల టు టౌన్ పోలీసులను హెచ్చరిస్తున్నాట్లూ ఆవేదన వ్యక్తం చేశారు. లేనిపక్షంలో హైకోర్టు కి కూడా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తున్నాం ఎఫ్.ఐ.ఆర్ కట్టడానికి నిరాకరించడం దానినీ ప్రశ్నించినటువంటి కార్యకర్తల పైన ఉన్నతా అధికారులకి తప్పుగా చెప్పడం కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం ఇవి ఇప్పటికైనా మానుకో వలసిందిగా నవ జ్యోతి నంద్యాల డివిజనల్ ప్రెసిడెంట్ దమాల వారి బృందంఈ విలేకర్ల సమావేశం ద్వారా పోలీసువారికి తెలియజేస్తున్నా మన్నారు.

## శ్రీభాగ్ ఒప్పందాన్ని అమలుచేయండి

### మెలిగానూరు వద్ద వరదాకాలువలు నిర్మించండి

కౌతాళం నవంబర్: 15( విభారె) ఈ రోజు రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ మరియు సీమ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదోని ఆర్.డి.ఓ రామకృష్ణ రెడ్డి గారికి, కౌతాళం ఎం.ఆర్.ఓ గారికి మరియు కోసిగి ఎం.ఆర్.ఓ లకు వేదవతి ప్రాజెక్టును,ఆర్.డి.యస్. కుడి కాలువలను 8 టి.ఎం.సి.ల పూర్తి సామర్థ్యముతో నిర్మించాలని,మెలిగనూరు వరద కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతూ రేపు 16 వ తేదీన కర్నూల్లో జరిగే శ్రీ బాగ్ ఒడంబడిక అమలు



చేయాలని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోకేష్ ఆదోని డివిజన్ కార్యదర్శి ప్రతాప్,రాయలసీమ యువజన వేదిక జిల్లా అధ్యక్షుడు రవివర్మ మరియు అనిల్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది.కరువు,వలసలకు నిలయమైన కర్నూలు పశ్చిమ ప్రాంతంలో వేదవతి, ఆర్.డి.యస్ కుడి కాలువలను నిర్మిస్తున్నారు. వేదవతి 8 టి.ఎం.సి లతో నిర్మించడానికి బదులుగా 3 టి.ఎం.సి లతో నిర్మిస్తున్నారు. ఇలా అయితే పశ్చిమ ప్రాంతం ప్రయోజనం నెరవేరదు,ఈ ప్రాజెక్టును 8 టి.ఎం.సి లతో నిర్మించడమే న్యాయం.మరొకవైపు ఆర్.డి.యస్ కుడి కాలువ నిర్మాణం కొనసాగుతుంది,దీనికి కూడా 4 టి.ఎం.సి లు కేటాయించారు.దీని వల్ల కూడా న్యాయం జరగదు దీనిని 8 టి.ఎం.సి లతో నిర్మించాలని ఈ సందర్భంగా కోరుతున్నాము.వర్షాకాలంలో మన ప్రాంతంలో వర్షం కురవకున్న పైనున్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రతి సంవత్సరం దాదాపు 270 టి.ఎం.సి ల వరద వృధాగా సముద్రంలో కలిసింది.మెలిగనూరు దగ్గర 50 టి.ఎం.సి ల సామర్థ్యంతో వరద కాలువని నిర్మిస్తే,కర్నూలు పశ్చిమ ప్రాంతానికి సాగు,త్రాగునీరు అందివ్వవచ్చు కావున పైన పేర్కొన్న న్యాయమైన అంశాలను విశాల హృదయంతో,సానుకూల వైఖరితో ఈ విషయాలను రాష్ట్ర ప్రభుత్వం,సంబందిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళలని అలాగే రేపు 16వ తేదీన కర్నూల్లో జరగబోయే పార్టీలకు అతీతంగా రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీమ విద్యార్థి సంఘం మద్దతుగా రాష్ట్ర సహాయ కార్యదర్శి నవీన్ కుమార్ పిలుపునిచ్చారు.

## శ్రీ శ్రీ నరసింహ స్వామి రాజ గోపుర నిర్మాణం కు విరాళాలు



కౌతాళం నవంబర్: 15( విభారె) మండల పరిధిలో ఉరుకుంద గ్రామంలో వెలసిన పుణ్యక్షేత్రం ఉరుకుంద శ్రీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం .భక్తుల పాలిటి కల్పవృక్షమై భక్తుల కోరికలను తీర్చే ఆరాధ్యదైవం గా నరసింహ స్వామి కొలుస్తారు. సోమవారం శ్రీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం కు ఆలూరు గ్రామ వాస్తవ్యులు శ్రీ చాకలి మల్లేశ్వరమ్మ వారి భర్త కృష్ణ మూర్తి మరియు వారి కుటుంబ సభ్యులు శ్రీ నరసింహస్వామి దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం వారు ఆలయ అధికారులకు రాజగోపురం నకు 1,01,111రూ విరాళలు అందజేశారు. దేవస్థానం తరఫున ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఫల ప్రసాదాలను అందజేశారు. వారిని శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.వారు మాట్లాడుతూ మొక్కుబడిగా మొక్కులు తీర్చుకున్నామని తెలిపారు.


## నేటి బాలలే రేపటి పౌరులు

### ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

తుగ్గలినవంబర్: 15( విభారె) మండల కేంద్రమైన తుగ్గలిలోని సాధన విద్యానికేతన్ పాఠశాల యందు ఘనంగా బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు.భారత దేశ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఘనంగా బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు.ముందుగా ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు జవహర్ లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా కేకులు కత్తరించి విద్యార్థులు బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మురళి,ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# బెల్లీ డ్యాన్స్ తో ఇరగదీసిన నోరా



హాట్ ఐటమ్ గాళ్ నోరా ఫతేహి 'కుసు కుసు' మ్యూజిక్ వీడియో కోసం ధరించిన డిజైనర్ డ్రెస్ ఇండస్ట్రీ సర్కిల్స్ సహా అభిమానుల్లో హాట్ టాపిక్ గా మారింది. అబు జానీ- సందీప్ ఖోస్లా డిజైన్ చేసిన దుస్తుల్ని ధరించి నోరా బెల్లీ డ్యాన్స్ తో అదరగొట్టింది. తాజాగా ఈ ఫోటోలతో పాటు బెల్లీ డ్యాన్స్ వీడియోని నోరా ఇన్ స్టాలో షేర్ చేసింది. ఇవన్నీ వైరల్ గా మారాయి.తాజా మ్యూజిక్ వీడియో కుసు కుసుతో మరోసారి నోరా రికార్డులను బద్దలు కొట్టింది. జాన్ అబ్రహం తదుపరి చిత్రం సత్యమేవ జయతే 2లోని ఈ కొత్త పాటలో తన అసాధారణ నృత్య కదలికలతో నోరా వేడెక్కించింది. ప్రస్తుతం ఈ డ్యాన్సింగ్ ప్రోమో వీడియో కేవలం 24 గంటల్లోనే 22 మిలియన్ల వ్యూస్ తో రికార్డులు బ్రేక్ చేసింది. పూర్తిగా కస్టమ్ బెల్లీ డ్యాన్స్ కాస్ట్యూమ్ తో ఇంటర్నెట్ ని ఇది షేక్ చేసిందని చెప్పాలి."ఇవి మరోప్రపంచానికి సంబంధించినవి.. మూడ్" అనే క్యాప్షన్ తో నోరా ఈ ఫోటోలను పోస్ట్ చేసింది. ఎంతో అద్భుతంగా డిజైన్ చేసిన బ్రాలెట్ కి సరితూగే స్కర్ట్.. దానికి సరిపోయే ఇతర ఉపకరణాలు ధరించి ఎంతో అందంగా కనిపించింది నోరా. ఏస్ డిజైనర్లు అబు జానీ - సందీప్ ఖోస్లా ఈ డ్రెస్ ని రూపొందించారు. డిజైనర్ ద్వయం తరచుగా నోరాతో కలిసి పని చేస్తుంటారన్న సంగతి తెలిసినదే. ప్రతిసారి వారి నుంచి వచ్చే లుక్ మాయాజాలం సృష్టిస్తుంది.

## బీచ్ బికినీ కంటే ఆ హ్యాట్ లోనే ఉంది సంథింగ్!

మంజుల దర్శకత్వంలో సందీప్ కిషన్ సరసన కథానాయికగా నటించిన అమైరా దస్తూర్ ఆ తర్వాత బాలీవుడ్ లో కొన్ని అవకాశాలు అందుకుంది. అక్కడ ఇమ్రాన్ హాస్మి.. ప్రతీక్ బబ్బర్ లాంటి స్టార్ల సరసన నటించింది ఈ భామ. ప్రస్తుతం ఓ మూడు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఊడి ఊది ఉజికానుమ్ ..కాథలై తేడి నిత్య నంద అనే రెండు తమిళ చిత్రాల్లో నటిస్తోంది. పిల్ ఫర్ సింగ్ అనే హిందీ చిత్రంలోనూ నాయికగా నటిస్తోంది. ఇటీవలే భగీరా అనే చిత్రంలోనూ అవకాశం అందుకుంది. ఈ సినిమాలో ప్రభుదేవా ఐదు గెటప్పులతో సర్ ప్రైజ్ చేయబోతున్నారు. ఇందులో అమీరా దస్తూర్ పాత్ర ఆసక్తికరంగా ఉండనుందిట. ఇంతకుముందు రిలీజ్ చేసిన భగీరా టీజర్ ఆసక్తిని పెంచింది.అమైరా ఇటీవల సోషల్ మీడియాల్లో ఇతర నాయికలకు



ధీటుగా వరుస ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. ఈ బ్యూటీ పోస్టులు అభిమానుల్లో వైరల్ గా మారుతున్నాయి. తాజాగా మాల్దీవుల విహారం నుంచి వేడెక్కించే ఫోటోషూట్ ని షేర్ చేయగా అది వైరల్ గా మారింది. వాటర్ బేబీ అమైరా తన మాల్దీవుల సెలవుల నుండి తిరిగి నగరానికి వచ్చారు. అనంతరం ఇన్ స్టాగ్రామ్ ప్రొఫైల్ లో వరుస ఫోటోలు దర్శనమిస్తున్నాయి. బీచ్ ఇసుకలో అమైరా ఫోటోషూట్ హీటెక్కిస్తోంది. వారాంతాల్లో ప్రత్యేకంగా శనివారాలు గడపడానికి మాత్రమే మార్గం ఉంది అంటే.. సముద్రంలో.. ఇసుకలో పాదాలు కదుపుతూ.. ముఖం మీద సూర్యుని కాంతిని ప్రసరిస్తుంటే దానిని ఆస్వాధించాలి! అంటూ క్యాప్షన్ ని ఇచ్చింది. అమైరా యానిమల్ ప్రింటెడ్ బికినీ లుక్ లో ఆకట్టుకుంటోంది. తన వెనుక విశాలమైన బీచ్.. సముద్రపు నీరు .. కాళ్ళపై ఇసుకతో తన వెకేషన్ మూడ్ ని ఆవిష్కరిస్తోంది.అమైరా పెద్ద టోపీని ధరించి సూర్య తాపం నుంచి తనని తాను బయటపడేసేందుకు ప్రయత్నిస్తోంది. గడ్డితో చేసిన టాన్ టోపీ ఆమె చిత్రానికి మొత్తం వెకేషన్ వైబ్ ఇచ్చింది. డిజైనర్ హౌస్ ఫ్యాన్సీ ప్యాంటు అధికారిక వెబ్ సైట్ లో ఈ టోపీ ధర రూ.2450. మిడ్ రిఫ్-బేరింగ్ బికినీలో మినిమల్ మేకప్ లో అమైరా ఫోటోలకు పోజులిచ్చింది. పింక్ షేడ్ లిప్ స్టిక్ తో అందంగా అలంకరించుకుంది. సినిమాల్లేకపోయినా ఇటీవల వెకేషన్స్ కి మాత్రం కొదవే లేదు ఈ అమ్మడికి.

## ఆగడు పోయినా.. మహేష్ నిందించలేదు

దూకుడు లాంటి ఆల్ టైం బ్లాక్బస్టర్ అందించిన మహేష్ బాబు శ్రీను వైట్లల క్రేజీ కాంబినేషన్లో ఆ తర్వాత వచ్చిన ఆగడు ఎంత పెద్ద డిజాస్టర్ అయిందో



తెలిసిందే. అప్పటికే ప్రయోగాత్మకంగా చేసిన 1 నేనొక్కడినే మూవీతో చేదు అనుభవం ఎదుర్కొన్న మహేష్ బాబు.. వైట్లతో కలిసి పక్కా మాస్ మూవీ చేద్దామనే ఉద్దేశంతో ఆగడును లైన్లో పెట్టాడు. ఆ సినిమా భారీ అంచనాల మధ్య రిలీజై బాక్సాఫీస్ దగ్గర చతికిలపడింది. అప్పటికి మహేష్ కెరీర్లోనే అది అతి పెద్ద డిజాస్టర్గా నిలిచింది. ఇక్కడి నుంచే శ్రీను వైట్ల పతనం కూడా మొదలైంది. వరుస పరాజయాలతో ఇప్పటిదాకా కోలుకోలేకపోతున్నాడు. తాజాగా ఆలీ నిర్వహించే టీవీ షోకు అతిథిగా వచ్చిన వైట్ల.. అసలు ఆగడు సినిమా పోవడానికి కారణాలేంటో వివరించాడు. ఇంతకీ అతనేమన్నాడంటే..ఆగడు సినిమాకు అలాంటి ఫలితం రావడానికి కారణం నేనే. బేసిగ్గా నా ఆడియన్స్... ఫ్యామిలీస్ యూత్. వాళ్లు నా సినిమాల నుంచి క్లాస్ ఎంటర్టైన్మెంట్ ఆశిస్తారు. నేను ఊర మాస్ చేసే డైరెక్టర్ని కాదు. దూకుడులో మహేష్ బాబులోని మాస్ యాంగిల్ చూసి ఆయన అభిమానులు సంతోషించారు. దీంతో వాళ్లు రెండో సారి మేం సినిమా చేస్తున్నామన్నపుడు మాస్ కావాలి మాస్ కావాలి అన్నారు. ఆ టైంలో హిందీలో సల్మాన్ హీరోగా టైగర్ జిందా హై మూవీ వచ్చింది. ఆ స్టయిల్లో..దూకుడుని మించి చేయాలని ఓ ఆలోచనతో బ్యాంకాక్ నుంచి మహేష్కు ఫోన్ చేసి లైన్ చెప్పా. మహేశ్కు కూడా అది నచ్చింది. అదే చేద్దామన్నారు. కానీ నిర్మాతలకు వేరే సినిమా వల్ల పెద్ద దెబ్బ పడింది. దీంతో వారి కోసం నా ఆలోచనను పక్కన పెట్టి అభిమానుల ఆకాంక్షల్ని కూడా దృష్టిలో ఉంచుకుని ఆగడు కథ రెడీ చేసి సినిమా చేశాం. మహేశ్లోని సామర్థ్యమంతా బయటకు తీయాలని విపరీతమైన డైలాగులు రాశాం. అంత మాస్ మా ఇద్దరికీ సూట్ అవలేదు. ఈ సినిమా ఫలితంతో నేనొక పాఠం నేర్చుకున్నా. మనం ఇతరుల గురించి ఆలోచించకుండా స్వార్థంగా ఉండాలి. మనకి ఏది సెట్టవుతుందో అది చేయాలి అని.. అని శ్రీను వైట్ల చెప్పాడు.ఐతే ఆగడు సినిమా ఆడకపోయినా తనను మహేష్ ఏమాత్రం నిందించలేదని శ్రీను వైట్ల చెప్పాడు. దూకుడు చాలా పెద్ద హిట్టయినపుడు మహేష్ చాలా సంతోషించాడని.. వారం రోజులు తామిద్దరం కలిసే ఉన్నామని.. సెలబ్రేషన్స్ చేసుకున్నామని.. ఆగడు పోయాక మహేష్ బాధ పడ్డప్పటికీ తనను ఏమీ అనలేదని.. పైగా తనే తన పుట్టిన రోజును సెలబ్రేట్ చేశాడని వైట్ల వివరించాడు. మహేష్తో మళ్లీ సినిమా చేయాలనుందని.. కానీ డి అండ్ డితో పాటు తన దగ్గరున్న మూడు స్క్రిప్టులతో సినిమాలు తీసి తనేంటో నిరూపించుకుని ఆ తర్వాత మహేష్కు సరిపోయే కథతో అతణ్ని సంప్రదిస్తానని చెప్పాడు వైట్ల.

## మార్టిన్ క్రో ఆత్మ శాంతించేదెప్పుడు?



న్యూజిలాండ్ దిగ్గజ క్రికెటర్ మార్టిన్ క్రో.. 2015 వన్డే వరల్డ్కప్ ఫైనల్ సందర్భంగా అందరీ చేత కన్నీళ్లు పెట్టించాడు. 'మరో మ్యాచ్ చూసేందుకు నా జీవితం ఇక అనుమతించకపోవచ్చు. కానీ బతికేందుకు ఈ జ్ఞాపకాలు చాలు. రోజంతా కన్నీళ్లను మాత్రం బయటకు కనిపించనీయను' అని అన్న మాటలు క్రికెట్ ప్రేమికులు ఇప్పటికీ తలుచుకుంటూ ఉంటారు. ఆ ఏడాది జరిగిన వరల్డ్కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా-న్యూజిలాండ్లు తలపడ్డాయి. ఆ మ్యాచ్ను ఎంతో ఆసక్తిగా తిలకించాడు మార్టిన్ క్రో. తన సారథ్యంలో తమ జట్టు సాధించలేని వరల్డ్కప్ను కివీస్ కైవసం చేసుకుంటుందని మార్టిన్ ఎంతగానో ఆశించాడు. కానీ మార్టిన్ క్రోకు నిరాశే ఎదురైంది. ఆ పోరులో న్యూజిలాండ్ ఘోర వైఫల్యంతో తొలిసారి వరల్డ్కప్ సాధించాలన్న కల తీరలేదు.ఆ తర్వాత ఏడాదికి మార్టిన్ క్రో కన్నుమూయగా, ఆపై న్యూజిలాండ్ రెండుసార్లు వరల్డ్కప్ ఫైనల్కు చేరింది. ఒకటి వన్డే వరల్డ్కప్లో(2019) అయితే, మరొకటి టీ20 వరల్డ్కప్(2021)లో కివీస్ తుదిపోరుకు అర్హత సాధించింది. 2019 వన్డే వరల్డ్కప్లో సూపర్ ఓవర్ రూపంలో కివీస్ను దురదృష్టం వెంటాడంతో రన్నరప్గానే సరిపెట్టుకుంది. ఆ ఫైనల్ మ్యాచ్లో ఇంగ్లండ్ విజయం సాధించి వరల్డ్కప్ను ముద్దాడింది. ఆ మ్యాచ్ సూపర్ ఓవర్కు దారి తీసిన పరిస్థితులు అప్పట్లో వివాదంగా మారాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**